




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 24 | సంచిక : 4 | ది. 26-2-2025 | విజయవాడ | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


## ఏపీ అసెంబ్లీ వాయిదా..



**అమరావతి,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** అసెంబ్లీ ఈ నెల 28వ తేదీకి వాయిదా పడింది. రేపు, ఎల్లుండి అసెంబ్లీకి సెలవు ఉండనుంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానానికి సభ్యులు ఆమోదం తెలిపిన తర్వాత సభను స్పీకర్ వాయిదా వేశారు. 28న ఉభయ సభలో ఉదయం 10 గంటలకు కూటమి సర్కార్ బడ్జెట్ ను ప్రవేశపెట్టనుంది.

# ఎన్ని సమస్యలున్నా మేనిఫెస్టోలోని ప్రతి హామీని నెరవేర్చుతాం

### గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

- ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తాం
- మే నెల నుంచి తల్లికి వందనం పథకం అమలు చేస్తాం
- అన్నదాత కింద కేంద్రసాయంతో 3 విడతల్లో రైతులకు రూ.20 వేలు
- వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ. 20 వేలు
- వచ్చే విద్యా సంవత్సరంలోగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తాం
- అభివృద్ధి, సంపద సృష్టి, సంక్షేమం, సాధికారత అనేది సక్సెస్ మోడల్
- ప్రధాని మోదీది సక్సెస్ మోడల్... కేజ్రీవాల్ ది ఫెయిల్యూర్ మోడల్
- సుస్థిర ప్రభుత్వంతోనే స్థిరమైన అభివృద్ధి
- సంప్రదాయాలు మరచి ప్రతిపక్ష హోదా ఇవ్వాలనడం సమంజసమా?
- దేశ చరిత్రలో ప్రజాసమస్యలపై కాకుండా ప్రతిపక్షహోదా ఇవ్వాలని నిరసన చేసిన ఏకైక పార్టీ వైసీపీ
- ప్రతిపక్ష హోదా ప్రజలివ్వాలి...మేం కాదు.
- సూపర్-6 పథకాల అమలుపై శాసనసభలో షెడ్యూల్ విడుదల చేసిన సీఎం

**అమరావతి,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** ఎన్ని సమస్యలున్నా మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి హామీని నెరవేర్చుతాం. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. సూపర్ 6 పథకాల అమలుపై శాసనసభలో షెడ్యూల్ విడుదల చేశారు. గవర్నర్ ప్రసం గానికి ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ సందర్భ ంగా ముఖ్య మంత్రి చంద్రబాబు మాట్లాడారు. సంప్రదా యాలు మరచి, నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ప్రతిపక్ష హోదా ఇవ్వాలనడం సమంజస మా అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సింది మేం కాదని ప్రజలు అని స్పష్టం చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం మూడు పార్టీలు కలిసి పోటీ చేయలేదని, దగా పడ్డ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయడం డబుల్ ఇంజన్ సర్కారుతోనే సాధ్యమని భావించామన్నారు. స్వర్ణాంధ్ర -విజన్ 2047 లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని, రాష్ట్రాభివృద్ధిలో కేంద్ర సహకారం మరువలేనిదని సీఎం చంద్రబాబు అన్నారు.



**ప్రతిపక్షహోదా ఇస్తేనే సభకు వస్తామనడం సమంజసం కాదు..** గత ప్రభుత్వ అసమర్థ పాలనతో రాష్ట్రంలో చాలా ఇబ్బ ందులు తలెత్తాయి. వ్యవస్థ నిర్వీర్యమైంది. డబుల్ ఇంజన్ సర్కారు ఉంటేనే రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని భావించాం. నేను ఈ సభ ద్వారా పవన్ కల్యాణ్ ను అభినందిస్తున్నాను. నేను 4వ సారి ముఖ్యమంత్రినయ్యారు. మూడుసార్లు పెద్దగా ఇబ్బందులు లేవు. ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ను నిర్వీర్యం చేయడంతో ఇబ్బందులు వస్తున్నాయి. సకాలంలో స్పందించి రాష్ట్రాభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తున్న ప్రధాని మోదీని అభినందిస్తున్నాను . నేను 9 సార్లు ఎమ్మెల్యే అయ్యాను. అప్పట్లో రోడ్లు కూడా ఉండేవి కాదు. ఎమ్మెల్యేకి కేవలం మిలటరీ జీపు, 3 గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేవారు. నేను గౌరవంగా జరిగిన సభలు చూశాను. కానీ గత ఐదేళ్లలో సభలు ఎలా జరిగాయో అందరూ చూశారు. కౌరవసభను గౌరవసభగా చేస్తానని నేను చెప్పాను. ప్రతిపక్షహోదా ఇస్తేనే సభకు వస్తాం, అసెంబ్లీ జరగనిస్తామని చెప్పడం నా 40 రాజకీయ జీవితంలో మొదటిసారి చూశాను. అదో చీకటి రోజు. ప్రజలు 11 మందిని గెలిపించారు. వారు 11 గంటలకు వచ్చారు. 11 గంటల 11 నిమిషాలకు వెళ్లిపోయారు. కేవలం 11 నిమిషాలు ఉండి స్పీకర్ ని కూడా అవమానించారు. ప్రజలు ఎన్నుకుంటేనే మనం సభలోకి వస్తాం. ముఖ్యమంత్రులు ఓడిన సందర్భాలూ ఉన్నాయి. కేజ్రీవాల్ ఎమ్మెల్యేగానూ గెలవలేదు. నాకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తాననడం దేశంలో ఎక్కడా జరగలేదు. సంప్రదాయాలు మర్చిపోయి ప్రతిపక్ష హోదా కావాలంటున్నారు .హోదా మీరో నేనో ఇచ్చేది కాదు...ప్రజలు మాత్రమే ఇచ్చేది.

**15 శాతం వృద్ధి రేటు లక్ష్యం..** అభివృద్ధి చేయాలి%ొ%సంపద సృష్టించాలి. తద్వారా ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. దాన్ని సంక్షేమానికి, అభివృద్ధికి ఖర్చు చేయాలి. సంపద సృష్టించకుండా అప్పులు తెచ్చి ఖర్చు చేయడం సరికాదు. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ముందుకుపోతున్నాం. 2047 నాటికి 42 వేల యూఎస్ డాలర్స్ పర్ క్యాపిటల్ ఆదాయం సాధించాలి. ఏపీలో 2047కి 42 వేల డాలర్ల తలసరి ఆదాయం తీసుకురావాలన్నది లక్ష్యం. ఇది సాకారం కావాలంటే 15 శాతం వృద్ధి రేటు ఉండాలి. 2014-19లో వృద్ధి రేటు 13.5 ఉంది. వైసీపీ హయాంలో 10 శాతానికి పడిపోయింది. మోదీ నాయకత్వంలో 2047 నాటికి దేశం నంబర్ వన్ గా నిలుస్తుంది. అప్పటికి ఏపీని నెంబర్ వన్ చేయాలన్నది నా ఆలోచన. సుస్థిర ప్రభుత్వాలతో స్థిరమైన వృద్ధి సాధ్యమవుతుంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

**వడ్డెరలకు క్వారీల్లో 10 శాతం రిజర్వేషన్లు..** పేదరికం లేని సమాజమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం. అధికారంలోకి వచ్చిన 8 నెలల్లో పేదరిక నిర్మూలనకు చర్యలు తీసుకున్నాం. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు మళ్లీ తెచ్చేందుకు సబ్ కమిటీ వేసి అధ్యయనం చేస్తున్నాం. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం. ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాము. గీత కార్మికులను ఆర్థికంగా పైకి తెచ్చేందుకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాం. చేనేత కార్మికులకు జీఎస్టీ ఎత్తేశాం. అదనంగా రూ.50 వేలు ఇంటికి ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పైకి తెచ్చేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. గత ఐదేళ్లలో మద్యం మాఫియా నడిపారు. నాశిరకం బ్రాండ్లు తెచ్చారు. ఎన్నికల్లో చెప్పిన విధంగా ప్రక్షాళన చేశాం. దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే మెరుగైన మద్యం పాలసీ తెచ్చింది ఏపీ ప్రభుత్వమే. అర్చకులకు రూ. 10 వేల నుంచి 15 వేలకు జీతాలు పెంచాం. దూప, దీప నైవేధ్యాల కింద ఆలయాలకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచాం. వేద విద్యార్థులకు నిరుద్యోగ భృతి కింద రూ. 3 వేలు ఇస్తున్నాం. దేవాలయాల పవిత్రత కాపాడతాం. తిరుమల ప్రసాదంలో నాశిరకం ప్రసాదంపై సీబీఐ విచారణ జరుగుతోంది. ఎక్కడా అపవిత్రతతకు చోటివ్వం.గత ప్రభుత్వంలో రాముని తల తీసేశారు. ప్రశ్నిచిన మాపై కేసులు పెట్టారు. అంతర్వేదిలో రథం కాలిపోతే లెక్కలేని విధంగా ప్రవర్తించారు.

**ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తాం..**

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోడానికి రేయింబవళ్లు పనిచేస్తాం. అధికారం చేపట్టగానే రూ. 3000 వేలు పింఛను 4000 వేలు చేశాం. 8 లక్షల 8 వేల 570 మంది దివ్యాంగులకు గత ఐదేళ్లలో ఒక్క పైసా కూడా పింఛను పెంచలేదు. కానీ కూటమి ప్రభుత్వం రాగానే రూ. 3 వేల నుం చి 6 వేలు చేశాం. డయాలసిస్ రోగులకు రూ. 10 వేలు ఇస్తు న్నాం. మంచానికే పరిమితమైన వారికి రూ. 15 వేలు పింఛను ఇస్తూ మానవత్వాన్ని నిరూపించుకున్నాం. మన దేశంలో ఒక్క పెన్షన్ల కింద ప్రతి ఏటా 64 లక్షల మందికి రూ. 33 వేల కోట్లు వెచ్చిస్తోంది ఏపీ ప్రభుత్వమే. సేవాభావంతోనే ప్రతి నెలా ఒకటో తేదీ పింఛను ఇస్తున్నాం. గత ఐదేళ్లలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి . ఎన్డీఏ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తోంది. పేదలకు పట్టెడన్నం పెట్టే అన్నాక్యాంటీన్లను గత ప్రభుత్వం నిలిపేసింది. 204 అన్నాక్యాంటీన్లు పునరుద్ధరించాం. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా దీపం పథకం కింద పేదలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాము. 48 గంటల్లో లబ్ధిదారులకు కట్టిన డబ్బు రీ పే చేస్తున్నాం. ఇందుకోసం రూ. 2,684 కోట్లు వెచ్చి స్తున్నాం. దీపం పథకం కింద కోటిమంది రిజిస్ట్రేషన్ చేయిం చుకోగా 93 లక్షలమందికి గ్యాస్ సిలిండర్లు అందించాం. సమైక్యాంధ్రలో నేను దీపం పథకం తెచ్చాను. ఆడబిడ్డలకు ఇబ్బంది లేకుండా వంటగ్యాస్ ఇస్తున్నాం. డీఎస్సీ ఇప్పటికే ప్రకటించాం. రానున్న విద్యా సంవత్సరం 16, 354 టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం. మే నెలలో తల్లికి వందనం పథకానికి శ్రీకారం చుడతాము.. ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ పథకం వర్తింపజేస్తాం. రైతు భరోసా కింద కేంద్రం ఇచ్చే రూ. 6000కు రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ. 14,000 కలిపి మూడు వాయిదాల్లో ప్రతి రైతుకు రూ. 20 వేలు ఇస్తాం.

# నేడు ప్రధాని మోడీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

- హైదరాబాద్ అభివృద్ధి పై సీఎం రేవంత్ - ప్రధాని మోడీ భేటీ
- మూసీ రివర్ ప్రాజెక్ట్, మెట్రో విస్తరణకు కేంద్ర సహాయం?
- కాంగ్రెస్ అధిష్టానం తో రాష్ట్ర రాజకీయాలపై కీలక చర్చ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో భేటీ కానున్నారు. ఈ సమావేశానికి ముహూర్తం ఖరారయ్యింది. బుధవారం ఉదయం 10:30 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి తన మంత్రివర్గ సహచరుడు శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) కార్యదర్శి శేషాద్రి, రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) జితేందర్‌తో కలిసి ప్రధానిని కలవనున్నారు. ఈ భేటీలో ప్రధానంగా హైదరాబాద్ నగర అభివృద్ధికి సంబంధించి కీలక అంశాలపై చర్చించనున్నారు. హైదరాబాద్ నగరంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు, మెట్రో రైలు పొడిగింపు ప్రాజెక్టుకు ఆర్థిక సహాయం, ఐపీఎస్ అధికారుల సంఖ్య పెంపు వంటి కీలక అంశాలపై ప్రధానిని సీఎం మెమొరాండం ద్వారా విజ్ఞప్తి చేయనున్నారు. నగరాభివృద్ధిలో భాగంగా కేంద్రం నుంచి మరిన్ని సహాయ నిధులను కోరే దిశగా ఈ భేటీ కొనసాగనున్నట్లు సమాచారం. ఇక ప్రధాని మోడీతో భేటీ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర కేబినెట్‌లోని పలువురు కీలక మంత్రులను కూడా కలవనున్నారు. ముఖ్యంగా తెలంగాణకు సంబంధించిన ప్రాజెక్టులకు మద్దతుగా కేంద్ర మంత్రుల వద్ద ప్రత్యేకంగా విజ్ఞప్తులు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, ఈ రాత్రికే సీఎం రేవంత్ రెడ్డి తన బృందంతో కలిసి ఢిల్లీకి బయలుదేరనున్నారు. ప్రధానితో సమావేశం అనంతరం కాంగ్రెస్ అధిష్టానం నేతలను కూడా రేవంత్ రెడ్డి కలవనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిణామాలు, తెలంగాణలో కేబినెట్ విస్తరణపై అధిష్టానంతో చర్చించే అవకాశముంది. కొత్తగా మంత్రివర్గంలో చేరబోయే నేతల ఎంపిక, రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై పార్టీ పెద్దలతో ముఖ్యంగా చర్చించనున్నట్లు సమాచారం. తెలంగాణలోని తాజా రాజకీయ పరిస్థితులు, రాష్ట్ర ప్రభుత్వ పాలన, కాంగ్రెస్ పార్టీ వ్యూహాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్న ఈ పర్యటనపై అన్ని వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి అందబోయే సహాయ నిధులపై ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎంకు ప్రధాని మోడీ నుంచి ఎలాంటి హామీలు లభిస్తాయో అన్నది ఆసక్తికరంగా మారింది.

# పార్టీ కండువా ఎప్పుడు మారుస్తున్నావ్..?

## వైసీపీ ఎమ్మెల్యేను ప్రశ్నించిన జగన్..?



**అమరావతి,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** ఎన్నికల్లో ఓడిపోయి-ఎన తర్వాత వైసీపీ సభ్యులు అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని.. సాధారణ ఎమ్మెల్యేగానే తనకు సమయం కేటాయిస్తే అసెంబ్లీలో గళం వినిపించలేమని జగన్ పేర్కొంటూ వస్తున్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీ సమావేశాలకు వెళ్తామని జగన్ పలు సందర్భాల్లో చెప్పడం జరిగింది. అయితే కూటమి ప్రభుత్వం తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టనుండటంతో జగన్ తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ క్రమంలోనే జగన్‌తో పాటు ఆయన పార్టీ ఎమ్మెల్యే బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యారు. ఈ సమయంలో ఓ వైసీపీ ఎమ్మెల్యే తీరు చర్చనీయాంశంగా మారింది. వైసీపీ సభ్యులందరూ పార్టీ కండువాలు వేసుకుని అసెంబ్లీకి రాగా, వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్? మాత్రం కండువా కప్పుకోలేదు. దీన్ని గమనించిన వైసీపీ అధినేత జగన్, సదరు ఎమ్మెల్యేపై అసహనం వ్యక్తం చేశారు. సభ్యులందరూ పార్టీ కండువాలు వేసుకుని వస్తే నువ్వెందుకు కండువా వేసుకోలేదని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ని జగన్? ప్రశ్నించారు. కండువా మర్చిపోయానని చంద్రశేఖర్ జగన్‌కు సమాధానం ఇచ్చారు. దీనిపై జగన్ మాట్లాడుతూ..కండువా మర్చిపోయావా..? మార్చడానికి సిద్ధంగా ఉన్నావా..? అంటూ ఎమ్మెల్యేని ప్రశ్నించారు. దీనిపై ఏం మాట్లాడకుండా ఎమ్మెల్యే చంద్రశేఖర్? అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ఈ వార్తలను ఎమ్మెల్యే ఖండించారు. తనపై టీడీపీ అనుకూల మీడియా తప్పుడు వార్తలను ప్రసారం చేస్తోందని ఆయన మండిపడ్డారు. దళిత ఎమ్మెల్యేలను కూటమి ప్రభుత్వం టార్గెట్ చేసుకుందని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్? ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇస్తే తమ 11 మందికి సమాధానం చెప్పాల్సి వస్తుందని కూటమి ప్రభుత్వం భయపడుతోందని ఎమ్మెల్యే తాటిపర్తి పేర్కొన్నారు. 2019లో ఓటమి పాలైన తర్వాత 3 సంవత్సరాల పాటు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఏపీలో కనిపించలేదన్నారు. ఒకరు ఆర్థిక లావాదేవీలు చూసుకుంటే, మరొకరు సినిమాలతో బిజీ అయిపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేయకుండా పిట్ట కథలు చెబుతోందన్నారు. వైసీపీ పాలనలో జగన్ చేసిన అభివృద్ధి ఎవరిని అడిగినా చెబుతారని... తాము ప్రజల్లోనే ఉంటామని ఎమ్మెల్యే చెప్పారు.

# కొత్త రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారు

- మార్చి 1న మూడు జిల్లాల్లో కొత్త కార్డుల పంపిణీ
- ఒకే రోజున లక్ష కార్డుల పంపిణీకి సన్నాహాలు
- ట్వీట్ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల జారీపై ప్రభుత్వం నుంచి కీలక అప్డేట్ వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వారందరికీ శుభవార్త వినిపించింది. లక్ష కొత్త రేషన్ కార్డులను ఒకే రోజున పంపిణీ చేయనుంది. దీనికి ముహూర్తం కూడా ఖరారు చేసింది. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీపై సస్పెన్స్ వీడింది. సంక్రాంతి, జనవరి 26 అంటూ రేషన్ కార్డుల పంపిణీని వాయిదా వేస్తూ వస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేలకు ముహూర్తం ఫిక్స్ చేసింది. మార్చి 1న కొత్త కార్డులను పంపిణీ చేయాలని నిర్ణయించింది. తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వక సంవత్సరాలు గడుస్తున్నాయి. తెలంగాణ ప్రజలు కొత్త రేషన్ కార్డుల కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. ఇది వరకే ప్రజాపాలన, గ్రామ సభల్లో అప్లికేషన్లు పెట్టుకోగా ఇటీవల మీ సేవ కేంద్రాల ద్వారా కూడా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కొత్త కార్డుల పంపిణీకి ముహూర్తం ఫిక్స్ అయింది. జనవరి 26న రాష్ట్రవ్యాప్తంగా 16,900 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయగా మార్చి 1న ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో హైదరాబాద్ జిల్లాల్లో పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది.

**మూడు జిల్లాల్లో కొత్త కార్డుల పంపిణీ :** రాష్ట్రంలోని ఉమ్మడి ఏడు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ప్రస్తుతానికి మూడు జిల్లాల్లో కొత్త కార్డుల పంపిణీకి సర్కార్ సిద్ధమైంది. మార్చి 8 తరువాత మిగతా జిల్లాల్లోనూ కొత్త కార్డుల జారీ ప్రక్రియ ఉంటుందని అధికారులు తెలిపారు. మార్చి 1న మూడు జిల్లాల పరిధిలో దాదాపు 1.12 లక్షల మందికి కొత్తగా రేషన్‌కార్డులు ఇవ్వనున్నట్లు తెలిసింది. కొత్త జిల్లాల ప్రకారంగా వికారాబాద్ జిల్లాలో 22 వేలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 15 వేలు, వనపర్తి జిల్లాలో 6 వేలు, నారాయణపేట జిల్లాలో 12 వేలు, మహబూబ్‌నగర్ జిల్లాలో 13 వేలు, గద్వాల జిల్లాలో 13 వేలు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 6 వేలు, రంగారెడ్డి జిల్లాలో 24 వేల మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశార్న హైదరాబాద్ నగరంలో కేవలం 285 మందినే గుర్తించారు. నగరంలో ఇంకా 83 వేల కుటుంబాలను పరిశీలించాల్సి ఉందని పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో 2014 నుంచి కొత్త కార్డులు జారీ చేయలేదు. ఈ క్రమంలో లబ్ధిదారుల సంఖ్య చాలా పెరిగింది. ఈ పది సంవత్సరాలలో పెళ్లి చేసుకొని అత్తగారింటికి వచ్చిన కోడళ్లు, కొత్తగా జన్మించిన పిల్లలు రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్నారు. ఇది వరకే ప్రజాపాలన, గ్రామ సభల్లో అప్లికేషన్లు పెట్టుకోగా, ఇటీవల మీ సేవ కేంద్రాల ద్వారా కూడా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మార్చి 1 న మూడు జిల్లాల పరిధిలో దాదాపు లక్ష మందికి పైగా కొత్తగా రేషన్‌కార్డులు ఇవ్వనున్నారు. కొత్త జిల్లాల ప్రకారంగా వికారాబాద్ జిల్లాలో ఇరవై రెండు వేలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 15 వేలు, వనపర్తి జిల్లాలో 6 వేలు, నారాయణపేట జిల్లాలో 12 వేలు, మహబూబ్‌నగర్ జిల్లాలో 13 వేలు, గద్వాల జిల్లాలో 13 వేలు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 6 వేలు, రంగారెడ్డి జిల్లాలో 24 వేలు, హైదరాబాద్ నగరంలో 285 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేసినట్లు సమాచారం.

# ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా అసెంబ్లీ, స్పీకర్ ఇవ్వలేరు: చీఫ్ విప్ జీవీ

- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో మాట్లాడిన చీఫ్ విప్ జీవీ



**అమరావతి,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** వైకాపా ప్రజలే తిరస్కరించిన ప్రతిపక్ష హోదాను అసెంబ్లీగానీ, స్పీకర్ గానీ ఇవ్వలేరని జగన్ ఇకనైనా గుర్తించాలని హితవు పలికారు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. అది మరిచిన వైకాపా ఎమ్మెల్యేలు గవర్నర్ ప్రసంగం సమయంలో సభ్యత, సంస్కారం వదిలి పెట్టి ప్రవర్తించిన తీరు సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. 8నెలలుగా జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై గవర్నర్‌ప్రసంగంలో చాలా స్పష్టంగా చెప్పారని అది కనీసం వినకుండా వ్యవహరిం చారని మండిపడ్డారు. జగన్, వైకాపా ఎమ్మెల్యేలు ఒక్కరోజైనా సభకు రాకపోతే పదవిపోతుందనే వచ్చారు తప్ప ప్రజలపట్ల గౌరవం ఉండి కాదని చురకలు వేశారు. ప్రజాసమస్యల పట్ల జగన్‌కు, వైకాపా ఎమ్మెల్యేలకు ఏమాత్రం గౌరవం లేదని స్పష్టంగా అర్థమవుతోందన్న చీఫ్‌విప్ జీవీ వాళ్లను ఇలానే వదిలేస్తే ఓడిపోయిన ఎమ్మెల్యేలను కూడా సభకు రావాలని డిమాండ్ పెడతారని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం విలువలు తెలియనివారు ప్రతిపక్ష హోదా అడగడం దురదృష్టకరం: ప్రజలు 11మందిని గెలిపిస్తే సభలో 11 నిమిషాలు మాట్లాడలేక పోయిన వాళ్లను చూసి ఆ 11మందినైనా ఎందుకు గెలిపించామని ప్రజలు బాధ పడుతున్నారన్నారు. మంగళవా రం గవర్నర్ ప్రసంగానికి ధన్యావాద తీర్మానంపై చర్చ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు చీఫ్ విప్ జీవీ. అయిదేళ్లుగా మిగిల్చిన గుంతలను 8నెలల్లోనే పూడ్చి గుంతల్లేని రాష్ట్రంగా చంద్ర బాబు తీర్చిదిద్దారన్నారు. ఒక్కసంతకంతో పింఛన్లు పెంచారని, సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఉచిత గ్యాస్‌ను అమలు చేస్తున్నారన్నారు. ఇచ్చిన ప్రతిహామీ నెరవేర్చేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే నిజమైన అభివృద్ధి అన్న స్ఫూర్తితో ముందుకు వెళ్తున్నట్లు గుర్తు చేశారు. రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో నెట్టారని, బడ్జెట్ నిధులన్నీ ఏం చేశారో తెలియని దుస్థితిలోకి నెట్టారని వాపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం సహకారంలో అమరావతి, పోలవరాన్ని ముందుకు తీసుకుని వెళ్తున్నారన్నారు. పల్లె సీమల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఎన్నో అభి వృద్ధి పనులు చేస్తున్నారని, నిధులు ఇస్తున్నారని తెలిపారు. దావోస్ సదస్సులు సహా వివిధ ప్రయత్నాల ద్వారా రూ.6లక్షల కోట్ల పెట్టుబడులతో 4లక్షల మందికి ఉద్యోగాలు కల్పించబోతున్నారని తెలిపారు. ఉచిత ఇసుక, మద్యం విధానం సంస్కరణ ద్వారా కూటమి ప్రభుత్వంలో ఎన్నో మార్పులు తీసుకుని వచ్చిందన్నారు. విద్యుత్ ఛార్జీలు కూడా గ్రీన్ పవర్ ద్వారా ముం దుకు వెళ్తున్నారని తెలిపారు. శాంతిభద్రతలు పూర్తిగా అదుపులోకి పెట్టారని, 2047కి స్వర్ణాంధ్ర ప్రదేశ్, ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యాలతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రజలు మరో 20 ఏళ్లు కూటమిని కొనసాగిస్తే ఏపీ అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలవడం ఖాయమన్నారు.

# వల్లభనేని వంశీ రిమాండ్ పొడిగింపు



**విజయవాడ,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ రిమాండ్‌ను విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు పొడిగించింది. గతంలో విధించిన రిమాండ్ గడువు నేటితో ముగియనుండటంతో జైలు నుంచే వంశీని వర్చువల్‌గా జడ్జి ఎదుట పోలీసులు హాజరుపరిచారు. అనంతరం న్యాయమూర్తి మార్చి 11 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

**పోలీసుల కస్టడీకి వంశీ..** నేటి నుంచి వంశీని మూడు రోజుల కస్టడీకి పోలీసులు తీసుకున్నారు. జైలు వద్దకు పటమట పోలీసులు చేరుకుని వంశీని కస్టడీలోకి తీసుకుని భారీ బందోబస్తు మధ్య ప్రత్యేక వాహనంలో వైద్య పరీక్షలకు తరలించారు. ఆయన్ను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న సమయంలో డ్రోన్ కెమెరాలతో పోలీసులు పర్యవేక్షించారు.

**వల్లభనేని వంశీకి 20 ప్రశ్నలు.. రెండున్నర గంటల పాటు విచారణ..** సత్యవర్ధన్‌ను అపహరించిన కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత వల్లభనేని వంశీ ని కస్టడీకి తీసుకున్న పోలీసులు మొదటి రోజు రెండున్నర గంటలపాటు విచారించారు. కిడ్నాప్ కేసులో పలు ఆధారాలను వంశీ ముందు ఉంచిన పోలీసులు 20కి పైగా ప్రశ్నలు సంధించినట్టు సమాచారం. కీలక ప్రశ్నలకు తనకు ఏమీ తెలియదని చెప్పిన వంశీ.. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసుకు, తనకు ఏం సంబంధం లేదని బుకాయించే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. సత్యవర్ధన్ స్టేట్‌మెంట్ ఆధారంగా వంశీని ముగ్గురు ఏసీపీలు విచారించారు.

# రారండోయ్ మల్లయ్య స్వామి తిరునాళ్లు చూద్దాం



విస్సన్నపేట,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) : స్వస్తిశ్రీ చంద్రమనేనా శ్రీ క్రోధి నామ సంవత్సర మాఘమాస బహుళ త్రయోదశి అనగా బుధవారం రాత్రి 26వ తేదీ 12 గంటలకు కొండ పర్వ శిఖరవాసులైన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వార్ల కళ్యాణ ఉత్సవ మహోత్సవ వేడుకలకు భక్తులు విరివిగా పాల్గొనవలసిందిగా ఆలయ ట్రస్టు మరియు ఉత్సవ కమిటీ మీడియా సమావేశంలో విజ్ఞప్తి చేశారు. ప్రాతః కాలం కాలమున రుద్రాభిషేకం, ఉదయం ఎనిమిది గంటల నుండి సహస్రనామార్చన ఉదయం 11 గంటల నుండి 6 గంటల వరకు కమలాకర సుస్వర సినీ సంగీత బృందం భక్తి గీతాలు 11 గంటలకు అన్న సమారాధన రాత్రి 7 గంటల నుండి 11 గంటల వరకు చేబ్రోలు నారాయణ దాసు భాగవతార్ చే గంగా మహత్యం హరికథ రాత్రి 11 గంటల నుండి ఒంటిగంట వరకు శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవం 12 గంటల నుండి శ్రీ విజయ నాటక మండలి వారిచే రామాంజనేయ యుద్ధం (యుద్ధం శీను) గయోపాఖ్యానం( వార్ సీను) సత్య హరిచంద్ర( వారణాసి నుండి కాటిసీను వం-కు) 27వ తేదీ గురువారం యధావిధిగా స్వామివారికి రుద్రాభిషేకం సహస్రనామార్చన 11 గంటల నుండి రెండు గంటల వరకు పాటల కచేరి సాయంత్రం ఐదు గంటల నుండి 9 గంటల వరకు బృందావన సంగీత గాన కృష్ణ లీలా కోలాట భజన సమాజం కోలాటం 9 గంటల నుండి గణేష్ ఈవెంట్స్ వారిచే మెగా బ్లాక్ పాస్టర్ మ్యూజికల్ నైట్ 28వ తేదీ శుక్రవారం సాయంత్రం ఏడు గంటల నుండి తెల్లవారుజామున మూడు గంటల వరకు మేళ తాళాలతో బేతాళ నృత్యాలతో విద్యుత్ దీపాలంకరణలతో స్వామివారి ఊరేగింపు జరుగునని తెలియజేశారు.

# జీజీహెచ్ లో పలు విభాగాలు పరిశీలించిన సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి



కాకినాడ,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) : కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి గైనిక్ వార్డులను పరిశీలించి రోగులతో వారికి అందుతున్న సేవలను గురించి ఆరా తీయడం జరిగినది.రోగుల పట్ల వైద్యులు మరియు సిబ్బంది ప్రవర్తన తీరు, మందులు అన్ని ఇవ్వడం జరిగిందా, లేదా ఆసుపత్రి నందు సేవలకు ఎవరైనా డబ్బులు అడిగినారా, ఆసుపత్రిలో శానిటేషన్ సక్రమంగా ఉన్నదా లేదా,ఆసుపత్రిలో పెట్టే భోజనము సరైన పరిమాణంలో ఉన్నదా లేదా,దాని నాణ్యత కోసం ప్రశ్నించడం జరిగినది. లేబర్ రూమ్ వద్ద లేబర్ రూమ్ వద్ద ఉన్న రోగుల సహాయకులతో కూడా సంభాషించడం జరిగినది.వారిని వారు అందరూ కూడా ఆసుపత్రిలో అందుతున్న సేవలపై పూర్తి సంతృప్తిని వెలిబుచ్చారు.అలాగే లాండ్రీ, మురుగు నీటి పారుదల వ్యవస్థ పరిశీలించారు. సూపరింటెండెంట్ వెంట డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ పి.శ్రీనివాసన్ డాక్టర్ పి.విఠల్,గైనిక్ హెచ్ఓడి డా.అనురాగమయి, నర్సింగ్ సూపర్డెంట్ పాల్గొన్నారు.

# ఇద్దరు నిరుపేద ఇంజనీరింగ్ విద్యార్థినిలకు లాప్టాప్ లు అందజేసిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్

- పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువు ఆగకూడదు
- ఇదే మా ఫౌండేషన్ ఆశయం..లక్ష్యం



రామచంద్రపురం,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) : రామచంద్రపురం లోని "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నారు. ఈ సేవా కార్యక్రమంల్లో భాగంగా రామచంద్రపురంకు చెందిన ఇద్దరు నిరుపేద ఇంజనీరింగ్ విద్యార్థినిలు గోడి మౌనిక,ఆరంగి మల్లేశ్వరి, సౌమ్య( సిస్టర్స్ )లకు రూ.1.90 లక్షల విలువచేసే రెండు లాప్టాప్ లను సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ సత్యం మాట్లాడుతూ పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువు ఆగకూడదనే తన కుమారుని మహోన్నత ఆశయం మేరకు ఫౌండేషన్ స్థాపించామని వెల్లడించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు లాప్టాప్ చాలా అవసరమని, ఆర్థిక స్తోమత లేని నిరుపేద కుటుంబాలకు చెందిన ఇద్దరు విద్యార్థినిలకు ఇంజనీరింగ్ ఉన్నత విద్య కోసం ఈ లాప్టాప్ లు అందజేయడం జరిగిందని చెప్పారు. చదువును మించిన ఆస్తి మరొకటి లేదని, ప్రతి ఒక్కరు చదువుకుని ఉన్నతంగా స్థిరపడాలనేది తమ లక్ష్యం అన్నారు.పేద కుటుంబంలో పుట్టి, ఆర్థిక స్తోమత లేక, ఉన్నత చదువులు చదవలేక మధ్యలో చదువు ఆపేసి ముందుకు వెళ్లలేని విద్యార్థులకు తమ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువు ఆగకూడదనేదే తన కుమారుని ఉన్నత ఆశయం మేరకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ స్థాపించి సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇటీవల తమ ఫౌండేషన్ ద్వారా చేపట్టిన మెగా సాఫ్ట్ వేర్ జాబ్ మేళా ద్వారా 28 మంది నిరుద్యోగులకు ప్రముఖ ఐటీ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించామని సంతృప్తి వ్యక్తం చేశారు.సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా నిరుపేదలైన కొంతమంది విద్యార్థులు దత్తత తీసుకుని చదివిస్తున్నట్టు ఈ సందర్భంగా వెల్లడించారు. పేదరికంలో ఉన్న తమకు లాప్టాప్ లు అందించిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంకి ఇరువురు విద్యార్థినిలు మౌనిక,మల్లేశ్వరిలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కూటమి అభ్యర్థికి తొలి ప్రాధాన్యత ఓటెయ్యండి

- మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు



నందిగామ,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) : తెలుగుదేశం జనసేన మరియు బిజెపి బలపరిచిన కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణ టిడిపి కార్యాలయంలో ఆయన ఎన్నికల ప్రచారం చేసి కలిసి కరపత్రాలు అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన 8 నెలల కూటమి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, జగన్ రెడ్డి స్థానిక సంస్థలను కైవసం చేసుకుని ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు ప్రభావితం చేస్తుందన్నారు.రాష్ట్ర శాసనసభతో పాటు శాసనమండలిలోనూ కూటమి మెజార్టీగా ఉండాలంటే ఎమ్మెల్సీ గెలుపు చారిత్రాత్మక అవసరం అన్నారు. ప్రతి ఒక్కరు బూత్ స్థాయి నుంచి బాధ్యత తీసుకోవాలని శాసన సభ్యురాలు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య నేతృత్వంలో నియోజకవర్గంలో నుంచి మంచి మెజారిటీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కు తీసుకురావాలని కోరారు. సాధారణ ఎన్నికలను ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా అంతే సీరియస్ గా తీసుకోవాలని దేవినేని ఉమా కోరారు.ప్రతి ఓటరును పార్టీశ్రేణులు నేరుగా కలవాలని, సోషల్ మీడియాను పెద్ద ఎత్తున వినియోగించుకోవాలని, పట్టణ ప్రాంతాల్లో ఉండే పట్టభద్రులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉమా సూచించారు. జగన్ రెడ్డి పాలనలో అప్పుల ఊబిగా మారిన రాష్ట్రాన్ని కేవలం ఏడు నెలల్లోనే సీఎం చంద్రబాబు ఏ విధంగా అభివృద్ధి బాట పట్టిస్తున్నారో ఓటర్లకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్, నందిగామ పట్టణ పార్టీ నేతలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మహాకుంభమేళలో హారతులిచ్చిన తొర్లికొండ



నందిగామ,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అలహాబాద్, ప్రయాగ్ రాజ్ జిల్లాలో, గంగ, యమున, సరస్వతి నదుల త్రివేణి సంగమం వద్ద జరుగుతున్న మహాకుంభమేళలో నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఇన్చార్జి తొర్లికొండ సీతారామయ్య మంగళ వారం ఆ పార్టీ నాయకులతో కలిసి స్నానమాచరించి పుణ్య నదులకు హారతి పూజలు జరిపించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ 144 ఏళ్ళకు ఒకసారి జరుగుతున్న ఈ మహాకుంభమేళలో స్నానవాచరించి త్రివేణి సంగమంలో హారతులు ఇవ్వడం తన పూర్వజన్మ సుకృతంగా పేర్కొన్నారు. ఈ సమ్మేళనం భిన్నత్వంలో ఏకత్వాన్ని చూపుతూ ప్రపంచంలోనే అతి పెద్ద కుంభమేళా కావడంతో దీనిని మహా కుంభమేళా అని నామకరణం చేశారని తెలిపారు.

# డ్రగ్ ట్రేడ్ యూనియన్ జాయింట్ సెక్రెటరీగా మోకా



అమలాపురం,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా డ్రగ్ ట్రేడ్ యూనియన్ జిల్లా జాయింట్ సెక్రటరీగా అమలాపురం శ్రీ సాయి నాథ్ మెడికల్ అండ్ జనరల్ ఏజెన్సీస్ అధినేత , భారతీయ జనతా పార్టీ డాక్టర్.బి ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి ది ఛాంబర్ ఆఫ్ అమలాపురం ఉపాధ్యక్షులు మోకా వెంకట సుబ్బారావును నియమించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా డ్రగ్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాసరావును నియమించారు.ఈ సందర్భంగా పలువురు మెడికల్ డిస్ట్రిబ్యూటర్,మెడికల్ వ్యాపారస్తులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆలపాటి విజయానికి బ్రాహ్మణ సంఘ నాయకులు ప్రచారం



నందిగామ,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) : తెలుగుదేశం, జనసేన మరియు బిజెపి కూటమి బలపరిచిన ఉమ్మడి కృష్ణ మరియు గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ రాజా గారిని ఈనెల 27వ తేదీ జరుగు ఎన్నికలలో నందిగామ నియోజకవర్గంలోని పట్టభద్రుల ఓటర్లందరూ తప్పనిసరిగా ఓటు వేసి వారిని అఖండ విజయం తో గెలిపించుకోవాలని, నందిగామ ఎమ్మెల్యే మరియు విప్ తంగిరాల సౌమ్య గారు మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బ్రహ్మశ్రీ వేమూరి ఆనంద్ సూర్య ల ఆదేశాలతో ప్రచారం ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన కోర్ కమిటీ సభ్యులు ప్రకాష్ నందిరాజు, రాష్ట్ర మహిళా కార్యదర్శి నందిరాజు కల్పన తెలిపారు.బిజెపి జిల్లా స్పోక్ పర్సన్ మరియు సీనియర్ బ్రాహ్మణ నాయకులు బండారు కేదారేశ్వర శర్మ,బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ కోఆర్డినేటర్ పెండ్యాల సుబ్బారావు,బిజెపి నాయకులు కొమరగిరి వాచస్పతి లు బ్యాలెట్ పేపర్ నందు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గారి పేరు మరియు వారి ఫోటో ఎదురుగా గల గడిలో ఒకటవ నంబరు వేసి వారిని గెలిపించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ బి ఎస్ నందిగామ సోషల్ మీడియా చీఫ్ రాజ హనుమంతరావు నందిరాజు, లక్ష్మీనారాయణ, వల్లి, చింతా ప్రసాద్, వారణాసి రవి తదితరులు పాల్గొన్నారు.

# టి జె పి యస్ కళాశాల విద్యార్థులకు పవర్ లిఫ్టింగ్ లో పథకాలు



గుంటూరు,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) : స్థానిక టి జె పి యస్ కళాశాల విద్యార్థులకు ఈ నెల 24 వ తేది ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లో జరిగిన అంతర కళాశాల ల పవర్ లిఫ్టింగ్ పోటీలలో టి రాజు యమ్. యస్. సి ( కెమిస్ట్రీ ), జి వి నితిన్ రెడ్డి (బి యస్. సి. ( కంప్యూటర్స్ ) విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకోవటం జరిగిందని కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండంట్ కె వి బ్రహ్మం తెలియచేశారు.పథకాలు సాధించిన క్రీడాకారులకు అభినందనలు తెలియచేశారు. సెక్రటరీ గారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడారంగం లో రానించాలి అంటే స్పష్టమైన లక్ష్యం, అంకిత భావన, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో కూడిన నేర్పు అంతకు మించి గొప్ప ప్రయత్నం వంటి భావాలు ఉండాలని, కొన్ని సార్లు విఫలమైనప్పటికీ క్రుంగిపోకుండా ఓటములను అనుభవాలుగా మరల్చుకుని విజయతీరాలకు వెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్ అనితా దేవి, వ్యాయామ అధ్యాపకులు ఆర్. శివాజీ, రసాయన శాస్త్ర విభాగాదిపతి రాజగోపాల్, సల్మా సుల్తానా, డాక్టర్ యూ రవి కుమార్, డాక్టర్ జె వి సుధీర్ కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# జుజ్జురుకు చెందిన లక్ష్మీ శివ సాయి శర్మకు అరుదైన గౌరవం



వీరులపాడు,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) : వీరుల పాడు మండలం లోని జూజ్జు రు గ్రామానికి చెందిన అర్చకులు యనమదల దుర్గా ప్రసాద్ కుమారుడు యనమదల లక్ష్మి శివ సాయి శర్మ కు అరుదైన గౌరవం దక్కింది. పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం మండలం, కొత్త పూసల మూరు గ్రామంలో శ్రీ చండి సాహిత రుద్ర యాగ మహోత్సవం జరుగగా శ్రీ కోదండ రామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మశ్రీ వేదమూర్తులు యనమదల లక్ష్మీ శివ సాయి శర్మ కు "స్మార్త సర్వజ్ఞా" అనే బిరుదుతో ఘనంగా సత్కరించి, వేద పండితులు ఆశీర్వాదంతో చేశారు. ఎన్టీఆర్ జిల్లా, వీరులపాడు మండలం లోని, జుజ్జూరు గ్రామానికి చెందిన అర్చకులకు పశ్చిమగోదావరిలో సన్మానం గావించడం పట్ల పలువురు నాయకులు అర్చకులు హర్షం వ్యక్తం చేస్తూ లక్ష్మీ శివ సాయి శర్మ ను ప్రత్యేకంగా అభినందించారు.

# నాటు సారా రహిత ఆంధ్ర ప్రదేశ్ కోసం 2.0 కార్యక్రమం



నూజివీడు,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాటు సారా ను అరికట్టేందుకు నూతనంగా నవోదయం 2.0 అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఏలూరు జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సి.హెచ్. అజయ్ కుమార్ సింగ్ తెలిపారు. మంగళవారం నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి గ్రామములో జరిపిన దాడులలో రెడ్డి కౌసల్య భర్త ఇస్సాకు అను ఆమెను అదుపులోనికి తీసుకోని 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమెకు సారా సప్లై చేస్తున్న అజ్మీర విజయ్ తండ్రి పంగిడయ్య అనే అతని పై కూడా కేసు నమోదు చేసినట్లు సి.హెచ్.అజయ్ కుమార్ సింగ్ తెలిపారు. ఈ దాడులలో ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ వై.వి.యన్.యస్.ఫణి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా నూజివీడు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆగిరిపల్లి, నూజివీడు, ముసునూరు, చాట్రాయి, మండలంలో బెల్ట్ షాపులు నిర్వహించే వారి పైన నాటు సారాయి తయారుచేసినా, అమ్మినా కలిగి ఉన్న నేరమని నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లం సప్లై చేసే వ్యాపారుల పైన, నాటు సారా తయారీ ఉపయోగించే బెల్లపు ఊట కలిగి ఉన్న భూ యజమానులపైన కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నూజివీడు ఎక్సైజ్ సీఐ ఫోన్ నెంబర్ 9440902462 కి సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి యొక్క వివరములను గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు.

# ఆర్టీసీ చైర్మన్, వైస్ చైర్మన్ కు ధన్యవాదాలు తెలిపిన కారుణ్య ఉద్యోగుల కుటుంబ సభ్యులు



విజయవాడ,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) : ఏపీ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు కృషి తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవ తో ఏపీ ప్రభుత్వం ఇటీవల కారుణ్య నియామకాలుకి అనుమతి తెలియచేయడం తో ఆర్టిసి చైర్మన్ మరియు కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణ రావు మరియు కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు లని విజయవాడ ఆర్.టి. సీ.భవన్ లో మర్యాదపూర్వకంగా కలిసి కారుణ్య ఉద్యోగుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# శ్రీ కోదండరామస్వామి దేవస్థానం అభివృద్ధికి పనులకు 198965 రూపాయలు విరాళం





హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) : బాపులపాడు మండలం రంగయ్య అప్పారావుపేట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులకు తుమ్మల సుబ్బారావు రూ 5000, తుమ్మల గోవర్ధన్ రావు రూ5116, అట్లూరి శ్రీనివాసరావు రూ 5116, ఎర్ర ఉదయ భాస్కర్ రూ 1116, అడుసుమిల్లి మనోహర్ రూ 20000, పరుచూరి నాగార్జున రూ 1000, తుమ్మల రమణ రూ 5058, వడ్లపట్ల వీరాంజనేయులు రూ 16000, దాసరి లతీష్ కుమార్ రూ 2011, ఓబిళ్ళనేని నాగరాజు రూ 5116 గోగినేని ప్రవీణ్ రూ 2000, శృంగవరపు నాగ వీర వెంకట పద్మ కుమారి రూ 10116, చలసాని ఆంజనేయులు రూ 25000, మొవ్వ రోహిత రూ 18500, సూరపనేని రాము రూ 3000, పరుచూరి రాధాకృష్ణమూర్తి రూ 25000, జి రమేష్ రూ 1116, కొల్లిపర శ్రీనివాస్ రూ 10116, బొబ్బ వెంకట రామకృష్ణ రూ 1120, డాక్టర్ యనమదుల రమేష్ రూ 5000, పరుచూరి ప్రేమ్ కుమార్ రూ 2000, పొట్లూరి సీతారాం ప్రసాద్ రూ 5116, చాపరాల వెంకట నాగ ఫణింద్ర రూ 5116, ఉప్పల కిరణ్ కుమార్ రూ 5116, అట్లూరి రాజశేఖర్ రూ 5000, సుగసాని శ్రావణి రూ 10116 రూపాయలు విరాళం అందజేసినట్లు శ్రీ కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ కోశాధికారి పరుచూరి సుకన్య తెలియజేశారు.ఈ సందర్భంగా పరుచూరి సుకన్య మాట్లాడుతూ కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధికి పనులకు ఈ వారం 198965 రూపాయలు వచ్చినట్లు తెలియజేశారు. అభివృద్ధి పనులకు ఇప్పటివరకు 388595 విరాళాలు వచ్చాయని విరాళాలు అందజేస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆలయ అభివృద్ధి పనులకు నిధుల సేకరణలో తమ వంతు సహకారాన్ని అందిస్తున్న పరుచూరి ధన కోటేశ్వరరావు, పరుచూరి ప్రసాద్, పరుచూరి రామకృష్ణ లకు ఆమె అభినందనలు తెలియజేశారు.

# నూతన ట్రాన్స్ ఫారం ఏర్పాటు



వీరులపాడు,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) : వీరుల పాడు మండలము, జుజ్జూరు గ్రామములో వోల్టేజ్ ప్రాబ్లం లేకుండా విద్యుత్ శాఖ వారు ఎస్సీ బీసీ కాలనీలలో కొత్త ట్రాన్స్ ఫారం బిగించారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఏఈ ఆదేశానుసారం లైన్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో లైన్ మెన్ కొండూరు ఆనందరావు, అసిస్టెంట్ లైన్ మెన్ మరియు కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో కొత్త ట్రాన్స్ ఫారం ఏర్పాటు చేశారు.విద్యుత్ సమస్యతో ఇబ్బంది పడుతున్న గ్రామస్తులందరూ ఈ సందర్భంగా వారి యొక్క సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఉన్నారు.

# సెల్ ఫోనులో ఆటలు కాదు శారీరక శ్రమ ఆటలు ఆడాలి

- గ్రామ సర్పంచ్ జీ రమేష్ బాబు



విస్సన్నపేట,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) : స్థానిక మండలంలోని కొండ పర్వ గ్రామంలో కొండ పర్వ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను గ్రామ సర్పంచ్ గొట్టిపూళ్ళ రమేష్ బాబు ప్రారంభించారు. నేటి యువత సెల్ ఫోన్ లో ఆటలను మాత్రమే ఆడుతున్నారని శారీరక శ్రమ కలిగించే కోకో వాలీబాల్ కబాడీ క్రికెట్ వంటి ఆటలు కూడా ఆడాలని ఆయన చెప్పారు. తాను మొదటి బహుమతి 30 వేల రూపాయలు అందిస్తున్నారని తమ సోదరుడు ద్వితీయ బహుమతి 20 వేల రూపాయలు జి చంద్రశేఖర్ ఇస్తున్నారని మూడవ బహుమతి 10000 ఆనందపాల్ నాలుగవ బహుమతి 5000 రూపాయలు జానుబాబు ఇవ్వటంతో పాటు కన్సోలేషన్ పేజీలకు బెస్ట్ ప్లేయర్ అవార్డులకు మరి కొంత మంది ముందుకు రావడం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ వైస్ ప్రెసిడెంట్ గాజుల శ్రీనివాసరావు రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఏపీ స్టేట్ రిఫరీ వాలీబాల్ గొర్రె శ్రీకాంత్ మూడు రోజులు పాటు జరిగే పోటీలను పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు.

# పంచాయతీ డంపింగ్ యార్డ్ నిర్వహణ పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం




పెనుగంచిప్రోలు,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) : పెనుగంచిప్రోలు గ్రామములో మంగళవారం పెనుగంచిప్రోలు జగ్గయ్యపేట, వత్సవాయి ,మండలా ల పంచా యతీ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, క్లాపు మిత్రలు, అందరూ కూడా గ్రామంలో డంపింగ్ యాడ్ షెడ్డు వద్ద లోకల్ ట్రైనింగ్ సెంటర్ లో జరిగిన కార్యక్రమమునకు హాజరైనారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి జి ఎల్ వి ఎన్ రాఘవన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.షెడ్ నిర్వహణ పై ఇంటింటి వ్యర్థాల సేకరణలో గ్రామ సచివాలయ సిబ్బంది విధుల గురించి వివరించారు.ప్లాస్టిక్ వాడకం నిరోదించుటకు తీసుకోవలసిన చర్యలు మరియు తడి చెత్త పొడి చెత్త ఇంటి వద్దే ఏరు చేయు టకు మహిళ ల కు అవగాహన చేయు టకు వెలుగు సిబ్బంది సచివాలయ సిబ్బంది కలసి కృషి చేయాలని తెలిపారు. పెనుగంచిప్రోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. శ్రీను, జగ్గయ్యపేట ఎం పీ డి ఓ శ్రీ నితిన్, వత్సవాయి ఎం పీ డి ఓ, ఆర్. డబ్ల్యూ.ఎస్ డి ఈ ఈ రామలింగేశ్వరరావు,ఈవోపిఆర్ అండ్ ఆర్డీలు కూడా పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్






**జవహర్ నగర్, ఫిబ్రవరి,25:** (వార్తా ప్రభ)జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు చక్కటి మార్కులు తెచ్చుకుని జవహర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకి మేడ్చల్ జిల్లా స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని కోరడం జరిగింది. అలాగే విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ మరియు 950 పైచిలుకు మార్కులు వస్తే ప్రతి ఒక్కరికి పదివేల రూపాయలు నగదు బహుకరిస్తానని చెప్పారు. వార్షికోత్సవ వేడుకలను ఘనంగా జరిపించిన ప్రధాన ఉపాధ్యాయునికి, ఉపాధ్యాయులకు, కృతజ్ఞతలు తెలియజేశారు. మరియు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ నాయకులు సవాల్గా తీసుకోవాలి

**పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి పిలుపు**



**రాయపర్తి ఫిబ్రవరి 25 (వార్తా ప్రభ)** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సవాల్ గా తీసుకోవాలని పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారంరాయపర్తి మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, మండలంలోని ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశ నిర్దేశ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేయడం మూలంగానే కాంగ్రెస్ పార్టీకి విజయం చేకూరుతుందని ఆమె అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కొత్త పాత తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం చేయుటకు ప్రతి కార్యకర్త ఓ సైనికుడి లాగా పని చేయాలని ఆమె సూచించారు. అదేవిధంగా గ్రామస్థాయిలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని ఆమె కోరారు. గ్రామస్థాయిలో స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటదని ఆమె తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీ గెలుపే ఏకైక లక్ష్యంగా పనిచేయాలని ఆమె పేర్కొన్నారు. ఈ విధంగా రాయపర్తి మండలంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్ష సమావేశం, రాబోయే ఎన్నికల విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ కృషిని సమన్వయంగా చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, క్లస్టర్ కోఆర్డినేటర్ లు, తదితరులు, పాల్గొన్నారు..

## హలీమ్ తయారీ పై విక్రయ దారులతో సమావేశం




**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ):** జోనల్ కమీషనర్ ఆదేశాల మేరకు వివిధ సర్కిళ్లకు చెందిన శేరిలింగంపల్లి జోన్లోని హలీం విక్రయదారు లందరితో సమావేశాన్ని ఏర్పాటు చేసి హలీం తయారీలో తీసుకోవాల్సిన పరిశుభ్రత చర్యలు, వాటిని సజావుగా పంపిణీ చేయడం గురించి వివరించారు. ఈ సమావేశంలో డా.విల్సన్ డిడి పశు వైద్యాధికారి అబ్దుల్ బాసిత్ వెటర్నరీ ఆఫీసర్,అలాగే అన్ని సర్కిల్ల అసిస్టెంట్ సిటీ ప్లనర్స్ అన్ని సర్కిల అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్లు అలాగే ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా హాజరయ్యారు

# మళ్ళీ వికసించేది గులాబీనే!!

● కాంగ్రెస్ పాలనలో నిరాశ నిస్పృహలో ప్రజానీకం ● కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్న తెలంగాణ ● అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం ● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్





**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 25 (వార్తాప్రభ ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్రంలో మళ్ళీ వికసించేది గులాబీనే అని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్. ఈ మేరకు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు, పట్టణ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ....... కాంగ్రెస్ పాలనలో నిరాశ నిస్పృహలో ఉన్న ప్రజానీకం మళ్ళీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నరు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం, ప్రజలు అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు వెళ్లాలంటే అది కేవలం కేసీఆర్ పాలనలోనే సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం అని తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించి కార్యకర్తలకు పంపిణీ చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ ప్రభుత్వం- కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద రోజువారి కార్యాచరణలో భాగంగా నియోజకవర్గం ప్రజలతో కలిసి వారి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు ఆహ్వానాలు, వినతిపత్రాలు స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మన రాష్ట్రాన్ని ఆధునిక రంగంలో అగ్రగామిగా నిలుపెందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చాలా కృషి చేస్తున్నారని అన్నారు. ప్రపంచ దేశాల నుండి పెట్టుబడులని ఆకర్శించి హైదరాబాద్ మహా నగరాన్ని టెక్నాలజీ హబ్ గా మార్చడమే ముఖ్యమంత్రి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు లక్ష్యం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేసిందాన్నారు. ప్రజా పాలనలో ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అలాగే నియోజకవర్గం ప్రజల సమస్యల పరిష్కారానికి తాను తప్పకుండా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, నాయకులు,సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు,అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి నీ అన్ని రంగాల్లో అభివృద్ధి పదంలో నిలుపుతాం

● పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ● శాసనసభ్యులు గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి డివిజన్ లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా రూ. 65 లక్షల వ్యయంతో శేరిలింగంపల్లి డివిజన్ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన..అలిండ్ సొసైటీ, భాగ్యలక్ష్మి నగర్ ఫేస్ -2 కాలనీలలో నూతనంగా చేపట్టే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన పిఏసీ ఛైర్మెన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరేక పూడి గాంధీ,శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేరిలింగంపల్లి డివిజన్ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని కాంగ్రెస్ పాలనలో క్రమక్రమంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే దీక్షుచిగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు డిఈ ఆనంద్,ఏఈ భాస్కర్,డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, డివిజన్ అధ్యక్షులు వీరేశం గౌడ్,ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్,మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, గోపాల్ యాదవ్,పద్మారావు,అలిండ్ ఎంప్లాయిస్ హౌసింగ్ కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ,భాగ్యనగర్ ప్రెసిడెంట్ మోహన్ ప్రసాద్, అలిండ్ సొసైటీ సెక్రటరీ సత్యం, ట్రెజరర్ ప్రకాష్,రామ్ రెడ్డి,సాయి రెడ్డి, రంగారావు,కిషోర్, చందు, వెంకటేశ్వర్ రావు,వెంకటేశ్వరా రెడ్డి శర్మ, చిన్ని సత్యనారాయణ, నాగేశ్వర్ రావు,ఖయుమ్,శ్రీనివాస్,భాగ్యనగర్ ఫేస్ 2 సెక్రటరీ పద్మారెడ్డి,సెక్రటరీ సూర్య జనార్దన్,మల్లేష్,నటరాజ్, జగన్నాథ్ రావు,నాగేశ్వర్ రావు, ఈశ్వర్ రావు,శ్రీధర్,బాలకృష్ణ, సాయి రెడ్డి,ముస్తఫా,అశ్విన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి నేతలతో నాకు ఎలాంటి విబేధాలు లేవు.

**- మాజీ పార్లమెంట్ సభ్యులు అంజన్ కుమార్ యాదవ్.**



హైదరాబాద్, ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి): హైదరాబాద్ వేదికగా జరిగిన యాదవ కుల సంఘం సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ కీలక నేత, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఒక సామాజికవర్గ నేతలు యాదవులను రాజకీయంగా ఎదగనీయంగా అడ్డుకుంటున్నారని.. ఇక నుంచి తమ సామాజికవర్గాన్ని తక్కువ చేసి చూసినా, పార్టీలో ప్రాధాన్యత ఇవ్వకపోయినా ఊరుకునే ప్రసక్తే లేదని ఘాటు వ్యాఖ్యలు చేసినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా.. ఆయన వ్యాఖ్యలపై అంజన్ కుమార్ యాదవ్ వివరణ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'నా మాటలు వక్రీకరించారు. రెడ్డి నేతలతో ఎలాంటి విబేధాలు లేవు. రాహుల్ ప్రధాని కావడమే అందరి లక్ష్యం. కులగణనకు మద్దతుగా మాట్లాడిన మాటలను వక్రీకరించి తనపై అసత్య ప్రచారం చేస్తున్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేసి బలహీన వర్గాల వాస్తవ స్థితిగతులు, జనాభా లెక్కలను కాంగ్రెస్ ప్రభుత్వం సేకరించింది. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగానే తెలంగాణలో కులగణన జరిగింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ సోమవారం యాదవ కుల బాంధవుల మీటింగ్ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన కొనియాడటం జరిగింది. అయితే ఈ సమావేశంలో తాను అనని మాటలను కూడా కొంతమంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తులు. వారి మీడియా వక్రీకరించి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రెడ్లను దుషించినట్టు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదు. ఇలాంటి తప్పుడు వార్తలను తెలంగాణ ప్రజానీకం నమ్మొద్దని, ఇలాంటి అసత్య కథనాలను ప్రచారం చేసే వారిని సామాజిక బహిష్కరణ చేయాలి. నా స్నేహితులు అనేక మంది రెడ్లు ఉన్నారు. వారు అందరితోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఒక సామాజిక వర్గాన్ని దూషించే వ్యక్తిత్వం నాది కాదు' అని అంజన్ కుమార్ యాదవ్ ప్రకటనలో పేర్కొన్నారు.

# పాఠశాలల్లో తెలుగును తప్పనిసరి చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు

**సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సహా అన్ని పాఠశాలల్లో తెలుగు తప్పనిసరి**
**తొమ్మిదో తరగతికి 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమలు**
**పదో తరగతికి 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి) తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరిగా బోధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సహా ఇతర బోర్డు పాఠశాలల్లోనూ తెలుగును తప్పనిసరిగా బోధించాలని ఆదేశించింది. తొమ్మిదో తరగతి వారికి 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేలా చూడాలని విద్యాశాఖకు సూచించింది. పదో తరగతికి 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు విద్యాశాఖకు మార్గదర్శకాలు జారీ చేసింది.

వార్తా ప్రభ
హైదరాబాద్

## కె ఏ టి ఒలింపియాడ్ శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థుల ప్రభంజనం.





**భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొత్తగూడెం, భజనమందిర్ రోడ్ లోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు కే ఏ టి ఒలింపియాడ్ లో మంచి ఫలితాలతో ప్రభంజ నం సృష్టించారు సోమవారం నాడు వెల్లడించిన ఫలితాలలో పాఠశాలకి చెందిన 31 మంది విద్యార్థులు కాష్ ప్రైజ్ తో పాటు, బంగారు పతకాలు, ప్రశంసపత్రాలు గెల్చుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ వి. యస్. ఎన్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ తరగతికి చెందిన నక్క మెహల్ 2000 రూపాయల కాష్ ప్రైజ్ 6వ తరగతికి చెందిన హర్ష ఉదయ రామ్ మరియు అలియా 1000 కాష్ ప్రైజ్ గెలిచారని 28 మంది విద్యార్థులు బంగారు పథకాలు సాధించారని అన్నారు అనంతరం పాఠశాల యాజమాన్యం విద్యార్థులను మరియు వారి తలితండ్రులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఏజీఎం శ్రీ జయప్రకాష్, కోఆర్డినేటర్ శ్రీ వెంకట్ , డీన్ శ్రీ రామకృష్ణ, సీ- ఇంచార్జి శ్రీ హరి కృష్ణ విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కారం కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం!!

● ఎలాంటి పైరవీలు లేకుండా నేరుగా క్యాంప్ ఆఫీసుకు రండి ● రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 25 (వార్తాప్రభ ప్రతినిధి)** ప్రజా సమస్యల పరిష్కారం కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం అని నియోజకవర్గ ప్రజలకు తెలిపారు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్. ఈ మేరకు మంగళవారం క్యాంప్ ఆఫీసుకు వివిధ సమస్యల పైన వచ్చిన ప్రజానీకంతో ఎమ్మెల్యే మాటామంతి నిర్వహించి సమస్యలను స్వీకరించి పరిష్కార మార్గాన్ని చూపెట్టారు. ఎలాంటి పైరవీలు లేకుండా నేరుగా క్యాంప్ ఆఫీసుకు రండి అని సూచించారు. ప్రజా పాలన అందించడమే తన ధ్యేయం అని తెలిపారు.

## ఘనంగా సిల్వర్ జూబ్లీ జరుపుకున్న 2000 సం. పూర్వ విద్యార్థులు







**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ):** బి.హెచ్.ఈ.ఎల్ లోని జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ 2000 బ్యాచ్ విద్యార్థులు 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అప్పుడు పాఠాలు నేర్పించిన టీచర్లు అందర్నీ పిలిచి శాలువాలు,పూలదండలు, మొక్కలు,,మెమెంటో లతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీచర్లందరూ విద్యార్థుల తీరును చూసి ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా విద్యార్థులు మరింత పైకి ఎదగాలని,మరిన్ని గొప్ప గొప్ప ఆశయాలను పూర్తి చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. విద్యార్థులు ఆటపాటలతో సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని విద్యార్థుల తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిహెచ్ఎల్ జడ్పిహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల తో పాటు పలువురు పాల్గొన్నారు

# ఎడిటోరియల్

## గోల్డెన్ చాన్స్ మిస్ చేసుకుంటున్న జగన్ ?

వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ వ్యూహాత్మకంగా చేస్తున్న పొరపాట్లు, తడబాట్లూ ఆ పార్టీని ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. ఏపీలో కూటమి ప్రభుత్వం బలంగా ఉన్న మాట నిజం. అంతే కాదు అసెంబ్లీ నిండా కూటమి పార్టీలు పరచుకున్నదీ నిజం. అయితే నిక్కమైన నేస్తం ఒక్కడున్నా చాలు అన్నట్లుగా విపక్షంగా వైసీపీ ఒక్కటి ఉన్నా చాలు, అసెంబ్లీలోనూ బయటా అందరి అటెన్షన్ వైసీపీ మీదనే ఉంటుంది. వైసీపీకి 11 మంది సభ్యులు ఉన్నారు. ఇది అందరికె తెలిసిన విషయమే. కానీ జగన్ మాత్రం దానికి తనకు తానుగా కెలికి వదిలిపెడుతున్నారు. కోరి మరీ కూటమి పక్షాల చేత సెటైర్లు వేయించుకుంటున్నారు. సోషల్ మీడియాలో అయితే ఇప్పటికే ఎలెవెన్ పార్టీ అని ముద్ర పడింది వైసీపీకి. ఇదంతా ఎందుకు అంటే వైసీపీ సరైన వ్యూహాలు లేక కోరి చిరిగి చాట చేసుకుంటున్న వైనమే. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కోసం పట్టుబట్టడం వైసీపీ చేస్తున్న తప్పుగానే అంతా చూస్తున్నారు. 18 మంది సభ్యులు ఉంటే ప్రతిపక్ష హోదా వస్తుంది. అది సంప్రదాయంగా ఆనవాయితీగా ఉంది. ఈ రోజున కూటమి ప్రభుత్వమే అది విధించిన నిబంధన కాదు. అంతకు ముందు నుంచి ఉంది. అయితే జగన్ కోరుతున్నట్లుగా అసెంబ్లీలో ఏకైక విపక్షం కాబట్టి వైసీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించమని. అది చేయాలీ అంటే అధికార విపక్షాల మధ్య ఇచ్చి పుచ్చుకునే ధోరణి ఉండాలి. ఏపీలోని రాజకీయమే అలా లేదు కదా. ఉప్పు నిప్పు మాదిరిగా టీడీపీ జనసేనలతో వైసీపీకి వ్యవహారం ఉంటుంది. అందువల్ల రూల్స్ అంటే రూల్స్ అన్నట్లుగానే కూటమి వెళ్తుంది. ఆ సంగతి జగన్ కి తెలిసి మరీ ఎందుకు ఈ విధంగా చేస్తున్నారు అంటే జనాలకు తెలియాలి అని అనుకోవాలి. జనాలకు ఏమి తెలియాలి అంటే కూటమి ప్రభుత్వం వైసీపీని ఇబ్బంది పెడుతోందని అన్నది బాగా ప్రచారంలోకి వచ్చి సింపతీ యాంగిల్ వర్కౌట్ అవుతుందని భావిస్తున్నట్లుగా ఉంది. కానీ జనాలు అలా అనుకోవడం లేదు. వైసీపీ ఎందుకు సభకు రాదు అనే వారు అంటున్నారు. వైసీపీ సభకు రావాలి. జగన్ సహా ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రజా పక్షంగా నిలిచి ప్రశ్నలు సంధించాలి. అపుడు అధికార పక్షం కనుక ఇబ్బందులు పెడితే అవమానాలకు గురి చేస్తే అపుడు జనాలు ఆలోచిస్తారు. అపుడు అయ్యో వైసీపీని ఇలా టార్గెట్ చేస్తున్నారేంటి అని అనుకుంటారు. %ూశ్రీంశీ =ముు% – ప్రీతి జింటాకు రూ.18 కోట్ల రుణమాఫీ.. కాంగ్రెస్ పై ఫైర్ అయిన నటి మరి అది జరగాలీ అంటే వైసీపీ వరసగా కొన్నాళ్ళ పాటు అయినా సభకు వెళ్ళాలి. తమకు ఒక నిమిషం సమయం ఇచ్చినా లేక అర నిమిషం సమయం ఇచ్చినా దానిని జాగ్రత్తగా వాడుకోవాలి. అంతే కాదు మైకు ఇవ్వమని కోరాలి. అపుడు ఇవ్వకపోతే తప్పు అధికార పక్షం వైపు వెళ్తుంది. ఇక జగన్ సభలో సీఎం బాబుతో సమానంగా మాట్లాడేందుకు మైకు కోరుతున్నారు. ముందే చెప్పుకున్నట్లుగా విపక్ష హోదా లేకపోవడం వల్ల అది సాధ్యపడదు. అందువల్ల జగన్ సభలో మాట్లాడకుండా కూర్చున్నా ఆయన మీద మీడియా ఫోకస్ ఉంటుంది. ఆయన తన సభ్యుల చేత మాట్లాడించవచ్చు. వారిని ఆ విధంగా కూటమి ప్రభుత్వం మీదకు ప్రజా పక్షాన పోరాటానికి సన్నద్ధులను చేయవచ్చు. తాను తన సీటులో ఉండే ఇదంతా చేయవచ్చు. ఇలా చేసినా వైసీపీకి అసెంబ్లీలో రావాల్సిన మైలేజ్ వస్తుంది. జనాలు కూడా వైసీపీ వైపు చూస్తారు. ప్రజా సమస్యల మీద వైసీపీ ప్రశ్నలు సంధిస్తే అధికార పక్షమూ ఇరుకునపడుతుంది. మరి ఈ విధంగా చేయకుండా సభకే రాము అని చెప్పడం వల్ల ఉపయోగం ఏమిటో జగన్ కే తెలియాలి అని అంటున్నారు. అంతే కాదు అసెంబ్లీలో కనిపించని ఎమ్మెల్యేలు అని వైసీపీకి నెగిటివిటీ దీని వల్ల పెరిగే అవకాశాలు ఉన్నాయి. మొత్తానికి తేలేది ఏమిటంటే జగన్ అసెంబ్లీలో ఉంటే ఆ పార్టీకి గోల్డెన్ చాన్స్. అది ఆయన మిస్ చేసుకుంటే మాత్రం వైసీపీకి అసెంబ్లీలో ఒక్క ఎమ్మెల్యే కూడా లేని ఇతర పార్టీలకు అసలు తేడా ఉండదు. ఇక అధికార కూటమికి అసెంబ్లీ నల్లేరు మీద నడక అవుతుంది. వైసీపీయే జనంలో కార్నర్ అవుతుందని అంటున్నారు.

## నేడు వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం లో పంచామృత అభిషేకాలు



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పూర్మిళ నగర్ లో ఉన్నశ్రీ మాత గోవింద మాంభా సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థానం.( ఊర్మిళ నగర్ భవాని పురం) బుధవారం మహా శివరాత్రి సందర్భంగా దేవస్థానం లో ఉదయం పంచామృత అభిషేకములు నిర్వహించ నున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం స్వామివారి పూజ కార్యక్రమాలు తీర్థ ప్రసాదాలు మధ్యాహ్నం మహా ప్రసాదం సాయంత్రం స్వామివారి కళ్యాణం అనంతరం గ్రామోత్సవం జరుగుతుందని వారు తెలిపారు. అందరూ స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించ వలసినదిగా కోరుతున్నామనిదేవస్థానం కమిటీ సభ్యులు భక్తులకు పిలుపునిచ్చారు.

## ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేసిన రైతులు

**అదిలాబాద్ ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రభుత్వం ప్రకటించిన మద్దతు కందుల విక్రయించుకోవడానికి నిర్ణయించిన పరిమితి పెంపు కోసం ఎమ్మెల్యే ప పాయల్ శంకర్ చేసిన కృషి మేరకు మంగళవారం కిసాన్ మోర్చా నాయకులు మార్కెట్ ఆవరణలో పాయల్ శంకర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.కందులు 3.31 క్వింటాళ్ల కంటే ఎక్కువ కొనుగోలు చేయొద్దని ప్రభుత్వం నిర్ణయించింది పంటను అమ్ముకునేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకొనిపోవడంతో పాటు పరిమితిని ఆరు క్వింటాళ్లకు పెంచాలని కోరారు.

## శ్రీ విజయ దుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని మిల్క్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న శ్రీ విజయ దుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం శివరాత్రి మహెూత్సవాలు ప్రారంభమయ్యాయని ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, చింతలపాటి నాగ వెంకట పవన్ కుమార్ శర్మ తెలిపారు, మంగళవారం భీమన వారి పేట మిల్క్ ప్రాజెక్టు ఎదురుగా వేంచేసి ఉన్న స్వామివారి దేవస్థానంలో తొలి రోజు బహుళ ద్వాదశి నీ పురస్కరించుకొని స్వామివారిని పెళ్లి కుమారుని,అమ్మవారి ని పెళ్లి కుమార్తెని చేయడం జరిగింది, ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రాత:కాలం నుండే మంగళ స్నానములు, గణపతి పూజ, పుణ్యా హాచన, కంకణ ధారణ వంటి కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు, అనంతరం స్వామివారిని అమ్మవారిని పెళ్లి కుమారుడు పెళ్లికూతురులను భక్తుల చే చేయడం జరిగిందని అన్నారు, ఈ కార్యక్రమంలో ధాన్యాన్ని మహిళా ముత్తయిదువులచే దంపుడు కార్యక్రమాన్ని చేపట్టి ఆ ధాన్యాన్ని స్వామివారికి సమర్పించడం జరిగిందని తెలిపారు, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాల తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ వారి పరివేక్షణలో నిర్వహించారు.

## వెంకటగిరి పట్టణ తెదేపా ప్రధాన కార్యదర్శి గల్లా శ్రీనివాసులుని పరామర్శించిన యేమినేని

**విజయవాడ ఫిబ్రవరి 25 (వార్తా ప్రభ ప్రతినిధి)** గుండెకు సంబంధించిన మూడు రక్త నాళాలు మూసుకుపోయి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకోడానికి తిరుపతి లోని అమర ఆసుపత్రిలో చేరిన తిరుపతి సమీపంలో ఉన్న వెంకటగిరి పట్టణ తెదేపా ప్రధాన కార్యదర్శి గల్లా శ్రీనివాసులు ని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి యేమినేని వెంకట రమణ మంగళవారం పరామర్శించారు. గల్లా శ్రీనివాసులు,యేమినేని వెంకట రమణ లు విజయవాడలోని ది కృష్ణా డిస్ట్రిక్టు లారీ ఓనర్స్ మ్యుచ్యువల్లి ఎయిడెడ్ కో అపరేటివ్ స్టోర్స్ లో ఎంప్లాయిస్ గా సుమారు 25 సంవత్సరాలు పనిచేశారు. అదే సంస్థ లో ఎంప్లాయిస్ యూనియన్ కి గల్లా శ్రీనివాసులు, వెంకట రమణ లు అధ్యక్ష కార్యదర్శులుగా ఉద్యోగుల హక్కులు కోసం ఎనలేని సేవలు అందించారు. కాలక్రమంలో గల్లా శ్రీనివాసులు తిరుపతి సమీపంలో ఉన్న వెంకటగిరి లో స్థిరపడ్డారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తరపున వెంకటగిరి పట్టణ తెదేపా ప్రధాన కార్యదర్శి హెూదాలో క్రియాశీలక పాత్ర పోషించిన వారిలో గల్లా శ్రీనివాసులు మొదటి వరుసలో వున్నారు. ఎలాంటి దురలవాట్లు లేని శ్రీనివాసులు గుండె సంబంధిత ఇబ్బందులు పడ్డంతో ఆయన అమరరాజా బ్యాటరీలు ఉత్పాదక సంస్థకు చెందిన అమర ఆసుపత్రిలో శస్త్ర చికిత్స నిమిత్తం జాయిన్ అయ్యారు. సమాచారం అందుకున్న యేమినేని వెంకట రమణ మంగళవారం తిరుపతి చేరుకొని గల్లా శ్రీనివాసులు ని పరామర్శించారు.కాగా గల్లా శ్రీనివాసులు కి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆ దేవుని దయవల్ల ఆయన త్వరగానే కొలుకొంటారని స్థానిక ఎమ్మెల్యే కే రామకృష్ణ ఆకాంక్షించారు.



## పట్టభద్రుల సమస్యలు పరిష్కరించగల సమర్ధుడు ఆలపాటి

- విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కితాబు
- ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం సెయింట్ జోన్స్ స్కూల్ ఉపాధ్యాయులతో సమావేశం





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఉపాధ్యాయులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలి చర్చించటమే కాకుండా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో మాట్లాడి ఆ సమస్యలను పరిష్కరించగల సత్తా వున్న నాయకుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కితాబిచ్చారు.ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) పశ్చిమ నియోజకవర్గం స్వాతి రోడ్ లోని సెయింట్ జోన్స్ స్కూల్ ఉపాధ్యాయులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మొదటి ప్రాధాన్యత ఓటు ఆలపాటి రాజాకి వేయాలని కోరుతూ బ్యాలెట్ పత్రంపై మొదటి ప్రాధాన్యత ఓటు ఏ విధంగా వేయాలో కూడా వివరించారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో భారీ మెజార్టీ తో ప్రజా ప్రభుత్వం ఏర్పడటానికి ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించారన్నారు. గత ప్రభుత్వం వైఖరి వల్ల రాజధాని అమరావతి ప్రాంతం చాలా నష్టపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలో వచ్చిన తర్వాత రాజధాని నిర్మాణం పరుగులు పెట్టించటంతో పాటు పరిశ్రమలను తీసుకువచ్చేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారని తెలిపారు.చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రతిసారి కూడా ఉపాధ్యాయుల గౌరవం నిలబెట్టేందుకు కృషి చేశారని గత ప్రభుత్వం ఉపాధ్యాయులను పట్టించుకోలేదన్నారు. విద్యార్థులు భవిష్యత్తుకి పునాదులు వేసే ఉపాధ్యాయులు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి ఎలాంటి ఆటంకం లేకుండా సాగేందుకు ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్ల ప్రకటించారు. మరో రెండేళ్లలో పుష్కరాలు రాబోతున్నాయి. అంతకంటే ముందే వెస్ట్ లో రోడ్లన్నీ సుందరంగా తయారుచేస్తామన్నారు. అభివృద్ధి చేయటమే ప్రజా ప్రభుత్వం ధ్యేయమన్నారు. పోరాటం చేసే వ్యక్తులు చాలా మంది వుంటారు కానీ ప్రజా ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులతో పాటు నాయకులు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారన్నారు.టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా మాట్లాడుతూ శాసనమండలిలో ఆలపాటి లాంటి సమర్ధుడైనా నాయకుడు వుంటే పట్టభద్రుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. ఈనెల 27వ తేదీన జరిగే ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, సెయింట్ జోన్స్ స్కూల్ సెక్రటరీ కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్, ప్రిన్సిపాల్ కె.వి.కళ్యాణి, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతావుల్లాహ్ ,టిడిపి రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు ఆషా,ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు సోలంకి రాజు,క్లస్టర్ ఇన్చార్జ్ యెదుపాటి రామయ్య, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, టిడిపి కార్పొరేటర్ రత్నకుమారి, బిజెపి కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర , టిడిపి సీనియర్ నాయకులు శివశర్మ , 44వ డివిజన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, 39వ డివిజన్ అధ్యక్షుడు రేగళ్ల లక్ష్మణరావు, డివిజన్ అధ్యక్షులు ముదిరాజ్ శివాజీ, సుబ్బయ్య, పేరం సత్యనారాయణ, పత్తి నాగేశ్వరరావు, కొనికి కొండయ్య, , ప్రసన్నలక్ష్మీ, సుభాసి సరిత, ఎస్.కె కరీముల్లా, టిడిపి నాయకులు మైలవరపు కృష్ణ, మైలవరపు దుర్గరావు, గంగవరపు మురళీ, రేగా కాంతారావు లతో పాటు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కెఎస్ లక్ష్మణరావును గెలిపించుకుందాం

### వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఉమ్మడి కృష్ణా –గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎన్నికలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించవలసిందిగా వైసీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. లక్ష్మణరావు తన పదవీ కాలంలో నిజాయితీతో, సమాజం పట్ల నిబద్ధతతో పని చేశారన్నారు. శాసనమండలిలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్య ఉద్యోగులు, సమగ్రశిక్ష ఉద్యోగులు, కౌలు రైతులు, గురుకులాల సిబ్బంది, సామాజిక తరగతులు, ప్రభుత్వ ప్రైవేటు కాలేజీ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. గత 8 నెలల కాలంలో ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు ఈ నెల 27 న జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో లక్ష్మణరావుని గెలిపించి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు.

## మహాశివరాత్రి మహెూత్సవాలు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదు

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాలు



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మహాశివరాత్రి మహెూత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం మహాశివరాత్రి పండుగ పురస్కరించుకొని వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని టెలి కాన్ఫరెన్స్ లో శాఖాధిపతులతో, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు ఆదేశించారు . ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహాశివరాత్రి పండుగ రోజున వచ్చే భక్తులకు ఘాట్ల వద్ద జల్లు స్నానాలకు, తాత్కాలిక మరుగుదొడ్లు, త్రాగునీటి సౌకర్యాలు, బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక రూములు, కల్పించి నిరంతరం పారిశుధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో నిర్వహించాలని, డ్రోన్ల సహాయంతో నిరంతరం పర్యవేక్షిస్తూ ఎక్కడ లోపాలు ఉన్నా వెనువెంటనే చర్యలు తీసుకోవాలని, అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, అధికారులను ఆదేశించారు.ఈ టెలి కాన్ఫరెన్స్లో శాఖధిపతులు ప్రజారోగ్య సిబ్బంది, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థినీలకు ఆత్మ రక్షణ విద్యలో శిక్షణ





**సంగం, ఫిబ్రవరి 25 (వార్తాప్రభ):** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండల కేంద్రంలోని జిబికెఆర్ జిల్లా పరిషత్ పాఠశాల నందు రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ చిత్తూరు వారి ఆధ్వర్యంలో ఆడపిల్లలకు ఆత్మరక్షణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఆడపిల్లల మీద జరుగుతున్న అఘాయిత్యాలు నుండి ఆడపిల్లలు తమని తాము ఎలా రక్షించుకోవాలో నేర్పించేదే ఈ సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమం అని ఆడపిల్లలు ఆత్మ రక్షణ కార్యక్రమంలో శారీరక మరియు మానసిక దృఢత్వాన్ని అలవర్చుకుంటారని, ప్రతి సమస్యని ఒంటరిగా ఏ విధంగా పరిష్కరించుకోవాలో, ఏ విధంగా ఆత్మస్థైర్యంతో జీవితంలో ముందుకు వెళ్లాలో, ఏ విధంగా నిరంతరం చదువుకోవాలో, 18 ఏళ్ల వచ్చేవరకు చదువు మానేయకుండా నిరంతరం ముందుకు వెళ్లాలని, సెల్ ఫోన్లు, టాబ్లు చూడటం తగ్గించాలని విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రసంగం చేశారు. అలాగే శారీరకంగా, మానసికంగా మంచి సాంకేతిక విద్యని అందిస్తున్నామని, అదేవిధంగా ఆడపిల్లలు ఆత్మ రక్షణ కోసం రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ కార్యక్రమం ద్వారా ఆత్మ రక్షణ నందు మెలుకవలు నేర్చుకుంటారని అన్నారు. కార్యక్రమంలో పిడి అంజయ్య, సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కాళహస్తి దేవాలయానికి బెజవాడ కనకదుర్గమ్మ పట్టు వస్త్రాలు





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**'మహా శివరాత్రి బ్రహ్మెూత్సవాలు సందర్భంగా శ్రీ జ్ఞానప్రసూనాంభికా సమేత శ్రీ కాళహస్తీశ్వరునికి బెజవాడ కనకదుర్గమ్మ వారి పట్టు వస్త్రాల సమర్పించారు.శ్రీ క్రోధి నామ సంవత్సర మహా శివరాత్రి బ్రహ్మెూత్సవాలు 2025 ను పురస్కరించుకుని – శ్రీ కాళహస్తిలో కొలువైన –శ్రీ జ్ఞానప్రసూనాంభికా సమేత శ్రీ కాళహస్తీశ్వరస్వామి వారికి విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం తరపున ఆనవాయితీ ప్రకారం మంగళవారం సాయంత్రం ఆలయ కార్యనిర్వహణాధికారి కె. రామచంద్ర మోహన్ పట్టు వస్త్రాలు సమర్పించారు.శ్రీ కాళహస్తి ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి,వేద పండితులు, అర్చకులు విజయవాడ నుండి విచ్చేసిన బృందాన్ని స్వాగతించి, ఆలయ మర్యాదలతో ఆలయం లోనికి తోడ్కొని వెళ్లారు.దేవదేవేరిలకు పట్టు వస్త్రాల సమర్పణ అనంతరం వేద ఆశీర్వచనం జరిగింది.ఈ కార్యక్రమం లో విజయవాడ ఆలయ స్థానాచార్య శివ ప్రసాద శర్మ, ప్రధాన అర్చకులు ఎల్. దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే నాయకుడ్ని గెలిపించాలి

● విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) పిలుపు ● ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం ఉపాధ్యాయులతో సమావేశమైన ఎన్డీయే నాయకులు

**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఏడు నెలల క్రితం ప్రజలందరీ ఓటు పవర్ తో ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. మరోసారి పట్టభద్రులు ఓటు పవర్ చూపించే సమయం ఆసన్నమైంది. సమస్యలపై పోరాటం చేసే నాయకుల్ని కాకుండా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే ఎన్డీయే కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాను భారీ మెజార్టీతో గెలిపించాలని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం పశ్చిమ నియోజకవర్గంలోని విద్యాధరపురం అప్పాలస్వామి క్వారీ రోడ్ లో గల కె.సి హైస్కూల్ లోని ఉపాధ్యాయులతో ఎంపి కేశినేని శివనాథ్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మొదటి ప్రాధాన్యత ఓటు ఆలపాటి రాజాకి వేయాలని కోరుతూ ఓటు ఏ విధంగా వేయాలో కూడా వివరించారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ప్రతి పక్షంలో వున్నప్పుడు సమస్యలపై పోరాడామని, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు విజ్ఞతతో ఆలోచించి ఎన్ డి ఏ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఉపాధ్యాయులకు ఏ సమస్య వచ్చినా అండగా నిలబడి పరిష్కరిస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే రాష్ట్రాభివృద్ధితో పాటు అమరావతి రాజధాని నిర్మాణాన్ని కూడా పరుగులు పెట్టిస్తున్నాడన్నారు..యువత భవిష్యత్తు అమరావతిరాజధాని పై ఆధారపడి వుందని అందుకోసం సీఎం చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. పేదరికం లేని సమాజం తయారు చేయాలనేది సీఎం ఆశయమని ఇందుకోసం రాష్ట్రంలో ప్రతి కుటుంబంలో ఒకర్ని ఖచ్చితంగా ఎంటర్ ప్రెన్యూర్ చేసే విధంగా





ముందుకు వెళుతున్నారన్నారు. అలాగే గత ప్రభుత్వం హాయంలో విద్యావ్యవస్థను సర్వనాశనం చేశారని, ఉపాధ్యాయులందరూ కలిసి 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి తగిన బుద్ధి చెప్పారన్నారు. అదే విధంగా ఎన్డీయే కూటమి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకుని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అత్యంత సన్నిహితంగా ఉంటారని అందువల్ల ఉపాధ్యాయుల సమస్యలను వారికి వివరించడమే కాకుండా పరిష్కరించగలరని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలతో పాటుగా యువత ప్రధాన సమస్య అయిన నిరుద్యోగ సమస్యను కూడా పరిష్కరించేలా ఆలపాటి రాజేంద్రప్రసాద్ కృషి చేస్తారని చెప్పారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా టీడీపి మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ ఫతాఉల్లాహ్ లు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం లో ప్రతి ఒక్కరూ భయంతో బ్రతికారని, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రజా ప్రభుత్వంలో ప్రజలు గుండెల మీద చేతులు వేసుకుని హాయిగా పడుకుంటున్నారన్నారు. అలాంటి నాయకుడ్ని బలపర్చి ప్రజా ప్రభుత్వం ఏర్పాడేందుకు కృషి చేసిన విద్యావేత్త మేధావి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, కే.సి హైస్కూల్ ప్రిన్సిపల్ హర్షవర్ధన్, టిడిపి రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు ఆషా,ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు సోలంకి రాజు,క్లస్టర్ ఇన్చార్జ్ యెదుపాటి రామయ్య, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, టిడిపి కార్పొరేటర్ రత్నకుమారి, బిజెపి కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర , టిడిపి సీనియర్ నాయకులు శివశర్మ , 44వ డివిజన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, 39వ డివిజన్ అధ్యక్షుడు రేగళ్ల లక్ష్మణరావు, డివిజన్ అధ్యక్షులు ముదిరాజ్ శివాజీ, సుబ్బయ్య, పేరం సత్యనారాయణ, పత్తి నాగేశ్వరరావు, కొనికి కొండయ్య, , ప్రసన్నలక్ష్మీ, సుఖాసి సరిత, ఎస్.కె కరీముల్లా, టిడిపి నాయకులు మైలవరపు కృష్ణ, మైలవరపు దుర్గరావు, గంగవరపు మురళీ, రేగా కాంతారావు లతో పాటు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృష్ణా మిల్క్ యూనియన్ ది 60 ఏళ్ల ఘన కీర్తి

### గర్వంగా చెప్పుకున్న పాలకవర్గ సభ్యులు



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కృష్ణా మిల్క్ యూనియన్ ఫ్యాక్టరీ ఆవరణలో మంగళవారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ 60 సంవత్సరాలుగా పూర్తి చేసుకున్న సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ సాధించిన ప్రగతిని వక్తలు ఘనంగా నెమరు వేసుకొన్నారు. కీఈ సర్వ సభ్య సమావేశం ఆరంభానికి ముందు ఫ్యాక్టరీ ఆవరణలో వజ్రోత్సవ చిహ్నంగా నిర్మించిన పైలాన్ ను కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ శ్రీ చలసాని ఆంజనేయులు , సంఘ అధ్యక్షులు, సమితి సిబ్బంది సమక్షంలో ఆవిష్కరించారు. ఈ యూనియన్ ఏర్పాటుకు మరియు సంస్థకు ప్రగతికి కృషి చేసిన మహానుభావుల కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సంస్థ ఈరోజు ఇంత ఉన్నత స్థానంలో ఉండటానికి కృషి చేసిన పాడి రైతులకు, సంఘ అధ్యక్షులు, సమితి ఉద్యోగులు మరియు ఇందుకు సహకరించిన వినియోగదారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశం సందర్భంగా సమితి వజ్రోత్సవాలను పురస్కరించుకొని 25 సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసుకున్న 28 మంది సంఘం అధ్యక్షులను ఘనంగా సత్కరించారు. ఇటీవల కాలంలో వివిధ ప్రసార మాధ్యమాల ద్వార సమితి ప్రతిష్ట ను దిగజార్చే విధముగా సంస్థ పై అసత్య ఆరోపణలతో దుష్ప్రచారం చేస్తూ, సమితికి నష్టం కలిగేలా/ సమితికి ప్రయోజనాలకు భంగం కలిగే విధముగా ప్రవర్తిస్తున్న సంఘ అధ్యక్షుల పై తగు చర్యలు తీసుకోనుటకు సర్వ సభ్య సమావేశము తీర్మానించారు. సమితి వజ్రోత్సవాలను పురస్కరించుకొని సర్వ సభ్య సమావేశము నందు ఘీ (గేదె మరియు ఆవు) ఒక లీటరు, అర లీటర్, 200 ఎమ్ ఎల్ , 100 ఎమ్ ఎల్ పెట్ జార్ బాటిల్స్ ను సర్వ సభ్య సమావేశములో ఆవిష్కరించారు.

## ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తో అద్భుతాలు- డాక్టర్ రామకృష్ణయ్య




**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 25 (వార్తా ప్రభ ప్రతినిధి):-**మండల పరిధిలోని ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐఎంఎల్,డిఎస్ విభాగాల ఆధ్వర్యంలో రెండు రోజుల వర్క్ షాప్ నిర్వహించారు. డేటా సైన్స్ విభాగాధిపతి షేక్ షాబజ్ ఆధ్వర్యంలో ఈ నెల 24 25 తేదీలలో డీప్ లెర్నింగ్ అండ్ బిగ్ డేటా అనాలసి వర్క్ షాప్ లో ముఖ్య అతిథిగా వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గుంటూరు ప్రొఫెసర్ ఎస్.కె వాసిం అక్రమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరంలో ఆధ్యాత్మిక టెక్నాలజీ అయినటువంటి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ తో అద్భుతాలు సృష్టించవచ్చని అన్నారు. ఇంజనీరింగ్ లాంటి సాంకేతిక విద్యార్థులు భవిష్యత్తుకు అనుగుణంగా ప్రతి విషయం ఇంటిలిజెన్సీ మెలుకువలు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే రామకృష్ణయ్య మాట్లాడుతూ భవిష్యత్తు ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్ దీనిని అందుకు అనుగుణంగా విద్యార్థులు సిద్ధం అవ్వాలని తెలిపారు. టెక్నాలజీ ద్వారా చెడు కాకుండా మంచిని స్వీకరించాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఐ సాయిరాం,కంప్యూటర్ సైన్స్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి కోటేశ్వరరావు, ఇతర సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మహా శివ రాత్రి మహోత్సవాల సందర్భంగా కమీషనరేట్ లో క్షేత్రస్థాయిలో చేసిన బందోబస్త్ ఏర్పాట్లు

### స్వయంగా పర్యవేక్షించిన నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా నగరంలో పుణ్య స్నానాలు చేయు ప్రదేశాల అయిన దుర్గా ఘాట్, పున్నమి ఘాట్, భవానిఘాట్, పవిత్ర సంగమం మొదలైన ఘాట్లను, క్యూ లైన్లు మరియు శివాలయాల వద్ద భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునే విధంగా శాంతి భద్రతలు మరియు ట్రాఫిక్ పరంగా క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన బందోబస్త్ ఏర్పాట్లను పోలీసు కమిషనర్ పరిశీలించారు. భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సిబ్బంది అప్రమత్తంగా బందోబస్త్ విధులు నిర్వహించేలాగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి పలు సూచనలు సలహాలను ఇచ్చారు. అదే విధంగా నగరానికి అతి దగ్గరలో ఉన్న యనమలకుదురు శివాలయం కు వెళ్లే రహధారులలో మరియు పరిసర ప్రాంతాలలో శాంతి భద్రతలు మరియు ట్రాఫిక్ పరంగా ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా బందోబస్త్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కృష్ణా జిల్లా ఎస్.పి. ఆర్.గంగాధర్ రావు తోపాటు యనమలకుదురు శివాలయం టెంపుల్ కు వెళ్ళి దర్శన అనంతరం శివాలయం మరియు పరిసర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ క్రమంలో టెంపల్ పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన సి.సి.కెమెరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ... మహా శివరాత్రి సందర్భంగా ఎక్కడా ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ నందు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో పటిష్టమైన బందోబస్త్ ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని స్నాన ఘాట్లలో ఎన్.డి.ఆర్.ఎఫ్./ఎస్.డి.ఆర్.ఎఫ్.సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని, ఎక్కడా ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా ఉండెందుకు సంబంధిత అన్ని శాఖల సమన్వయంతో బందోబస్త్ ఏర్పాట్లను చేయడం జరిగిందని, అందరూ ఆనందోత్సాహాల మధ్య మహా శివరాత్రి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ, ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ , కృష్ణా జిల్లా ఎస్.పి. ఆర్.గంగాధర్ రావు , డి.సి.పి. లు గౌతమి షాలి , కృష్ణ మూర్తి నాయుడు , ఏ.డి.సి.పి. ఏ.వి.ఎల్.ప్రసన్న కుమార్ , ఏ.సి.పి.లు, ఇన్స్పెక్టర్లు, మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా అర్ధరాత్రి షాపుల కూల్చివేత

### జీవనోపాధి పోవడంతో పాటు లక్షలాది రూపాయల సరుకు నష్టం

### వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించిన వ్యాపారస్తులు





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తాము వ్యాపారం చేసుకుంటున్న షాపులను అర్ధరాత్రి వేళ తమకు షాపులను అద్దెకు ఇచ్చిన ఓనర్ అక్రమంగా జెసిబి తో కూల్చివేయడంతో జీవనోపాధిని కోల్పోయిన వ్యాపారులు సంబంధిత యజమాని దౌర్జన్యం పై వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తారాపేట పీనా మహమ్మద్ స్ట్రీట్ వ్యాపారస్తులు గత 45 సంవత్సరాలుగా అద్దె కుంటూ వ్యాపారాలు చేసుకుంటున్న వాసంతి ఎంటర్ప్రైజెస్, వసంత డీజిల్ స్పేర్స్ షాపులను సోమవారం అర్ధరాత్రి షాపు ఓనర్ జెసిబి తో ధ్వంసం చేయడం పట్ల సంబంధిత వ్యాపారస్తులు మానికొండ శ్రీనివాస్, మిరియాల శ్రీహరిష్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మీడియాతో వారు మాట్లాడుతూ కనీసం తమకు నోటీసులు కూడా ఇవ్వకుండా, సుమయం ఇవ్వకుండా షాపులను అన్యాయంగా అక్రమంగా ధ్వంసం చేశారన్నారు. షాపులో ఉన్న లక్షలాది రూపాయల సరుకు ధ్వంసం అయిందన్నారు. కుట్రపూరితంగా తమ వ్యాపారాలను ధ్వంసం చేయాలన్న ఉద్దేశంతో ఓనర్ మద్దుల దామోదరం ఈ అన్యాయానికి పాల్పడ్డారన్నారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని, పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. తమకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలని, అక్రమానికి పాల్పడ్డ షాపు ఓనర్ పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన దారపనేని



**కనిగిరి ఫిబ్రవరి 25 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గ ప్రజలకు తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు కనిగిరి మాజీ ఏఎంసి చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దారపనేని మాట్లాడుతూ ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారికి మహాశివరాత్రి ఎంతో ప్రాముఖ్యమైనదని,శివపార్వతుల వివాహం జరిగిన రోజు మహాశివరాత్రి అని, పరమశివుడు కైలాస పర్వతంతో ఒకటై పరిపూర్ణ నిశ్చలత్వంతో పర్వతంలా మారిన రోజు అని, మహాశివరాత్రి రోజున శైవ క్షేత్రాలు శివనామస్మరణంతో మారుమ్రోగుతాయని, భైరవకోన, మిట్టపాలెం నారాయణస్వామి, నియోజకవర్గంలోని శివాలయాలలో భక్తులు శివపార్వతులను దర్శించుకుని పార్వతీ పరమేశ్వరుల కృపకు పాత్రులు కాగలరని దారపనేని ఆకాంక్షించారు.

## ఘనంగా 155 సంవత్సరాల సంప్రదాయ వేడుకలు

● 27న కెనాల్ రోడ్ లో అత్యంత వైభవంగా రథోత్సవం ● శ్రీ కన్యకా పరమేశ్వరి అన్న సత్ర కమిటీ సభ్యులు వెల్లడి



**విజయవాడ పశ్చిమ, ఫిబ్రవరి 25: (వార్తా ప్రభ ప్రతినిధి)** మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 27వ తేదీ సాయంత్రం 5:30 గంటలకు కెనాల్ రోడ్ లో అత్యంత వైభవంగా రథోత్సవం జరగనుందని శ్రీ కన్యకా పరమేశ్వరి అన్న సత్రం కమిటీ అధ్యక్షులు బచ్చు వెంకటలక్ష్మి వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి బయన శ్రీ రాజేష్ చెప్పారు. మంగళవారం అన్న సత్రం హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ 27వ తేదీ సాయంత్రం 5:30 గంటలకు రథోత్సవాన్ని విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు లాంఛనంగా ప్రారంభిస్తారని చెప్పారు. రథోత్సవంలో శ్రీ కనకదుర్గ మల్లేశ్వర స్వామివార్లు, శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివార్లు, శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామివార్లు, శ్రీ గంగా పార్వతీ సమేత వసంత మల్లికార్జున స్వామి వార్ల ఉత్సవ మూర్తులు పాల్గొని భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. రథోత్సవంలో విశిష్ట అతిథులుగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ చిన్ని, ఆర్యవైశ్య వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, పశ్చిమ శాసనసభ్యులు యలమంచలి సుజనా చౌదరి, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు , తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దుర్గగుడి కార్యనిర్వహణాధికారి కే. రామచంద్ర మోహన్ తదితరులు పాల్గొంటారని చెప్పారు. శ్రీ కన్యకా పరమేశ్వరి అన్న సత్రం కమిటీ ఆధ్వర్యంలో 155 సంవత్సరాలుగా రథోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ రథోత్సవం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు డోగిపర్తి శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర వైద్య చికిత్సకు లక్ష రూపాయలు మంజూరు



**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 25(వార్తా ప్రభ ప్రతినిధి):-** మండల పరిధిలోని మూలపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ విజయలక్ష్మి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం లక్ష రూపాయల (ఎల్ ఓ సి) సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరు చేసిన పత్రాన్ని విజయలక్ష్మి కుమారుడు సురేంద్రకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మంగళవారం అందజేశారు. లబ్ధిదారులు ఎంఎల్ఏ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కాకి నాగరాజు, జిల్లా తెలుగు యువత కార్యదర్శి గరికపాటి శివ గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## చెట్టు చెప్పిన సంగతులు!



పిరికితనము వదులుకొని
ధైర్యాన్ని నింపుకొని
ఆశయాన్ని సాధించు!
నమ్మకాన్ని పెంచుకొని
గర్వాన్ని మానుకొని
వినయాన్ని ఆనుకొని
మొక్కలాగ జీవించు!
చుక్కలాగ ప్రకాశించు!
చిక్కులన్ని ఎదుర్కొని
హక్కులన్ని కాచుకొని
స్వేచ్ఛగా విహరించు!
న్యాయముకై నినదించు!
వినోదము పంచుకొని
వికాసము ఎంచుకొని
జగతిలో తేజరిల్లు!
జీవితాన వర్ధిల్లు!
మంచి దారి ఎన్నుకొని
సుగుణాలను పుచ్చుకొని
ఆదర్శము చూపించు!
నడవడిని దిద్దుకొని
గురువులను తలచుకొని
వ్యక్తిత్వం మలచుకొని
పదిమందికి బోధించు!
ప్రగతి బాట నడిపించు!
మనిషితనం చాటుకొని
దేశభక్తి నాటుకొని
దేశకీర్తి ప్రకటించు!
గొప్ప స్ఫూర్తి అందించు!
చిరు నవ్వులు పులుముకొని
అందరినీ కలుపుకొని
దేశాభివృద్ధి కాంక్షించు!
దీక్షను కొనసాగించు!

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు

## భవన నిర్మాణ వ్యర్థాల తొలగింపు కు ట్రాక్టర్ యజమానులతో అవగాహన ఒప్పందం

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాలు



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భవన నిర్మాణ వ్యర్థాలు సర్కిల్ పరిధిలో ఎప్పటికప్పుడు తొలగాలన్న విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాల మేరకు అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, ప్రైవేట్ ట్రాక్టర్ యజమానులతో నిర్మాణ వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించే విధంగా అవగాహన ఒప్పందం (ఎమ్ ఓ యు) కొరకు మంగళవారం ఉదయం తమ తమ సర్కిల్ కార్యాలయాల్లో సమావేశం నిర్వహించారు. సర్కిల్ పరిధిలోగల పబ్లిక్ వీధుల్లో నిలువ ఉన్న భవన నిర్మాణ వ్యర్థ పదార్థాలను తొలగించుటకు గాను రవాణా ట్రాక్టర్ యజమానులకు నగరపాలక సంస్థ మధ్య అవగాహన ఒప్పందం ద్వారా సర్కిల్ పరిధిలో గల అన్ని వీధుల యందు ఉన్న భవన నిర్మాణ వ్యర్థ పదార్థాలను నగరపాలక సంస్థ సిబ్బంది వారి సమాచారం మేరకు వాటిని తొలగించుటకు వారి సమక్షంలో భవన యజమానులతో తొలగింపునకు సహేతుకమైన చార్జ్ వసూలు పై ట్రాక్టర్ ద్వారా తొలగించాలని ఈ సమావేశంలో చర్చించారు. ఈ అవగాహన ఒప్పందంలో ఉన్న షరతుల ప్రకారం ఉదయం 6 గంటల నుండి ట్రాక్టర్ కార్మికులతో సహా వాహనము అందుబాటులో ఉండాలని డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న డ్రైవర్లు మాత్రమే ట్రాక్టర్ తో అనుమతించాలని తొలగించిన వ్యర్థాలను నిర్దేశించిన ప్రాంతము లో కాకుండా కాలువలో కానీ శివారు ప్రాంతపు రోడ్డు లో కానీ వెయ్యరాదని, ఒకవేళ వేస్తే ఐదు వేల రూపాయలు జరినామా విధిస్తామని, నోడల్ ఆఫీసర్ తెలియజేసిన 24 గంటల్లో సిఎన్డి వేస్టుని తొలగించాలని, మొదలగు విషయాలపై షరతులు ఉన్నాయి. ఈ సమావేశంలో డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్ర బోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు, రవాణా ట్రాక్టర్ల యజమానులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల నియోజవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

● పోలింగ్ ఏర్పాట్ల వివరాలను తెలియజేసిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ.



**మచిలిపట్నం ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మంగళవారం స్థానిక కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ డీకే బాలాజీ సహాయ రిటర్నింగ్ అధికారి డిఆర్ఓ కే చంద్రశేఖర రావు తో కలిసి మీడియా ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు, ఇతర అంశాలను వివరిస్తూ....కృష్ణ- గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి జిల్లా పరిధిలో 63,114 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. ఈనెల 27వ తేదీ గురువారం జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. జిల్లాలో 63,114 మంది ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, ప్రశాంతంగా వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం ఓటర్లకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు.పోలింగ్ కు 48 గంటల ముందుగా సైలెంట్ పిరియడ్ అమల్లోకి వస్తుందని, సెక్షన్ 144 అమల్లోకి వస్తుందని, ఆ సమయంలో ఎటువంటి ప్రచారాలూ చేయరాదని పేర్కొన్నారు. 25వ తేదీ సాయంత్రం 4.00 గంటల నుంచి పోలింగ్ ముగిసే వరకు సైలెండ్ పిరియడ్ ఉంటుందని స్పష్టం చేశారు.

**77 పోలింగ్ కేంద్రాల్లో ఓటెయ్యనున్న 63,114 మంది** జిల్లాలో 31 లొకేషన్స్ లో 77 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా 477 మంది అధికారులను, సిబ్బందిని కేటాయించామని వివరించారు. వీరిలో 94 మంది ప్రిసైడింగ్ అధికారులు, 92 మంది ఏపీవోలు, 199 మంది ఓపీవోలు ఉన్నారని తెలిపారు. వీరితో పాటు 92 మంది మైక్రో అబ్జర్వర్లు కూడా ఉంటారని తెలిపారు. జిల్లా పరిధిలో మొత్తం 63,114 మంది ఓటర్లు ఉన్నారని వారిలో 35,321 మంది పురుషులు, 27,789 మంది మహిళలు,4 గురు థర్డ్ జెండర్స్ ఉన్నారన్నారు. 77పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, వీడియో గ్రాఫర్లను ఏర్పాటు చేశామని చెప్పారు.ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అన్ని రకాల చర్యలు చేపట్టామన్నారు. మార్చి 03వ తేదీన గుంటూరులో ఓట్ల లెక్కింపు జరుగుతుందని, 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని స్పష్టం చేశారు.

**మూడు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు** పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేసేందుకు అనువుగా జిల్లా పరిధిలో మచిలీపట్నం నోబుల్ కళాశాల, గుడివాడ,ఉయ్యూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయా లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. 26వ తేదీ ఉదయం నుండి పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ అందజేస్తారని చెప్పారు. అలాగే 27వ తేదీ సాయంత్రం పోలింగ్ సిబ్బంది నుంచి రిసెప్షన్ కేంద్రం వద్ద మెటీరియల్ స్వీకరిస్తారని పేర్కొన్నారు. మెటీరియల్ ను, సిబ్బందిని తరలించేందుకు అనువుగా తగినన్ని వాహనాలను అందుబాటులో ఉంచామని వెల్లడించారు. అన్ని జిల్లాలకు తగినంత మెటీరియల్ సిద్ధం చేశామని పేర్కొన్నారు.

**శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా.. ప్రశాంత పాతీవరణంలో ఎన్నికలు** ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా తగినంత మందిని నియమించామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ఏజెంట్లు, సిబ్బందితో పాటు ఓటర్లు కూడా పోలింగ్ కేంద్రం లోపలికి సెల్ ఫోన్లు తీసుకెళ్లరాదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పోలింగ్ నిర్వహించే జిల్లాలోని 77 పోలింగ్ కేంద్రాలలో ఉన్న విద్యాసంస్థలకు ఈనెల 26, 27వ తేదీ రెండు రోజులు సెలవు ప్రకటించడం జరిగిందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, వీల్ చైర్లు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లుగా నమోదైన పట్టభద్రులు ఓటు వేసేటప్పుడు అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో 1,2,3 సూచిస్తూ బ్యాలెట్ పేపర్లో నమోదు చేయాలన్నారు. ఓటరు పోలింగ్ స్టేషన్ కు వచ్చేటప్పుడు సాధారణ ఓటరు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని లేనియెడల ఆధార్ కార్డ్ ,డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, పాస్ పోర్టు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు లేదా ఇతర ప్రైవేట్ పారిశ్రామిక సంస్థలు ద్వారా ఉద్యోగులకు జారీ చేయబడిన సేవా గుర్తింపు కార్డు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జారీ చేయబడిన అధికారిక గుర్తింపు కార్డులు. సంబంధిత ఉపాధ్యాయ గ్రాడ్యుయేట్ ల నియోజకవర్గానికి చెందిన ఓటర్లు ఉద్యోగంలో ఉన్న విద్యాసంస్థల చేజారీ చేయబడిన సేవా గుర్తింపు కార్డు,యూనివర్సిటీ జారీ చేసిన డిగ్రీ డిప్లొమా ఒరిజినల్ సర్టిఫికెట్,కాంపిటెంట్ అథారిటీ జారీ చేసిన ఫిజికల్ హ్యాండీక్యాప్ ఒరిజినల్ సర్టిఫికెట్, భారత ప్రభుత్వం సామాజిక న్యాయం %ఽ% సాధికారిక మంత్రిత్వ శాఖ వారిచే జారీ చేయబడిన ప్రత్యేక వైకల్యం ఐడి కార్డ్, వంటి పది రకాల గుర్తింపు పత్రాలను తీసుకురావచ్చునని కలెక్టర్ డీకే బాలాజీ వివరించారు.ఓటర్ గా నమోదైన పట్టభద్రులు ఎన్నికల సంఘం నియమ నిబంధనలను పాటిస్తూ ఓటు హక్కునువినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

## వీరభద్రుడు ప్రళయతాండవం చేసిన పవిత్ర క్షేత్రం పట్టిసం







వీరభద్రుడు ప్రళయతాండవం చేసిన నేల పవిత్ర పట్టిసాచల క్షేత్రం. మహా శివరాత్రి రోజున వేలాది భక్తజన సందోహం భక్తి శ్రద్దలతో పరమశివుడి రూపమైన వీరేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తారు.క్షేత్ర పవిత్రతని గోచరించే శైవ క్షేత్రాలలో పట్టిసాచల క్షేత్రం ఒకటి. శ్రీశైలం, కాశీ, కేదారం, కాళహస్తి, పట్టసం పంచక్షేత్రాలు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రాలలో అరుదైన శివక్షేత్రం పట్టిసీమ వీరేశ్వర స్వామి ఆలయం ఒకటి. పోలవరం మండలం, పట్టిసీమ గ్రామ సమీపాన గోదావరి నది మధ్యలో కొండపై వెలసిన పుణ్యక్షేత్రం. ఇటు ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి అందాల మేళవింపుతో నిత్యం భక్తులతో సందడి చేస్తున్న దివ్య క్షేత్రం. ప్రతి సంవత్సరం కార్తీకమాసం మరియు శివరాత్రి పర్వదినాలలో వేలాదిమంది భక్తులు వచ్చి స్వామివారి నిదర్శించుకుంటారు. పట్టిసీమ రేవు నుండి సుమారు మూడు,నాలుగు కిలోమీటర్లు దూరంలో ఇసుక తిన్నెల మీద నడిచి గుడికి చేరుకుని కొండ మీద ఉన్న స్వామి వారిని చేరుకుంటారు.భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి ఆలయ చరిత్ర: పూర్వకాలంలో పట్టిసీమ క్షేత్ర పర్వతాన్ని దేవకూట పర్వతం అని పిలవబడేది. ఈ పర్వతం పరమేశ్వరుని సందర్శించుకొనుటకు కైలాసం వెళ్ళినది.కైలాస పర్వతం,దేవకూట పర్వతాన్ని హేళన చేసింది. ఆ అవమానాన్ని తట్టుకోలేక వెనుదిరిగి వచ్చి,శివకేశవుల ఇద్దరు గురించి తపస్సు చేసింది.ఆ తపస్సు ప్రభావం చేత శివకేశవులు ప్రత్యక్షమై ఏ వరం కావాలో కోరుకోమన్నారు.ఆ సందర్భంగా తనకు జరిగిన అవమానాన్ని వ్యక్తపరచింది. కైలాస పర్వతం విడిచి పెట్టి నా పర్వతంపై ఉండమని కోరింది. అప్పుడు శివ కేశవులు ఇద్దరు కూడా నీ పర్వతం పై ఉంటామని వరం ఇచ్చి సమయం వచ్చు వరకు వేచి ఉంటామన్నారు.దక్షప్రజాపతిని సంహరించడానికి పరమేశ్వరుడు తన జటాజూటం తెంచి వీరభద్రుని పుట్టించి, పట్టిసం అనే ఆయుధాన్ని చేతికిచ్చి,దక్షిణ యజ్ఞం నాశనం చేసి దక్షిణ ప్రజాపతి శిరస్సును ఖండించమని ఆజ్ఞాపించారు.వీరభద్రుడు ఉగ్రావేశంగా వెళ్లి దక్షిణ యజ్ఞం నాశనం చేసి దక్షిణ ప్రజాపతి శిరస్సు ఖండన చేసి పట్టిసం అనే ఆయుధంతో ఉగ్రవేశంగా దేవకుంట పర్వతం పైకి వచ్చి ప్రళయ ఉగ్రతాండం చేశాడు.ఆయన ఉగ్ర ఆవేశాన్ని శాంతింప చేయటానికి అగస్త్య మహాముని వచ్చి తన రెండు చేతులతో ఆలింగాశం చేసుకుని వీరభద్రుని శాంతింప చేసి పరమేశ్వరుని ఆజ్ఞ మేరకు దక్ష సంహారం కోసం ఉద్భవించావు స్వామి నీ ఉగ్ర ఆవేశంను తగ్గించి దేవకూట పర్వటం యొక్క వరం కోరిక మేరకు స్వయంభువుగా వెలసి భక్తుల కోరికలు తీర్చమని ముని కోరారు. వీరభద్రుని యొక్క జడలు శిరస్సు మీద ముడిగా చుట్టి అగస్త్య మహాముని శరణు వేడారు. అందువల్ల నేటికి లింగాకారం మీద స్పష్టంగా అగస్త్య మహాముని బాహువులు లింగాకారం మీద శిఖముడి మనకు నిదర్శనంగా కనబడుతుంది.పూర్వము జాంబవంతుని యొక్క తపస్సు కోరిక మేరకు నారాయణమూర్తిని కృత యుగము నాటి గజేంద్రునికి మోక్షం ఇచ్చిన రూపంతో ఉండమని కోరాడు. నారాయణమూర్తి జాంబవంతుని భావన మేరకు భవననారాయణమూర్తిగా పట్టిసాంచల క్షేత్రానికి క్షేత్రపాలకుడిగా కేశవుడు అవతరించినాడు. నేటికీ శివకేశవులు యొక్క దివ్య క్షేత్రముగా విరజిల్లుతున్న క్షేత్రం పట్టిసాంచల క్షేత్రం. గౌతమ మహాముని గో హత్య మహాపాతక నిర్మూల కోసం గోదావరి నదిని వెంట తీసుకుని వస్తూ దేవకూట పర్వతం చుట్టూ పలుమార్లు ప్రదక్షిణ చేయడంతో గోదావరి నది కూడా ప్రదక్షిణ చేయడం వల్ల .. వెంట వస్తున్న గోదావరి నది కూడా ప్రదక్షిణం చేయడంతో ఈ క్షేత్రం గోదావరి నడి గర్భంన నిండి ఉన్నది. ఫిబ్రవరి 25వ తేదీ నుండి 27 వరకు మహా శివరాత్రిఉత్సవాలు జరుగుతాయి. ఉత్సవాలకు వచ్చే భక్తులకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామని ఆలయ ఈవో సురేష్ నాయుడు తెలిపారు

## ఉప్పలమ్మతల్లి - ఎల్లమ్మ తల్లి కీ ప్రత్యేక పూజలు చేసిన వైసిపి నేత తన్నీరు





**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 25( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు గ్రామంలో తూర్పు బజారు కు చెందిన లక్కిరెడ్డి కోటిరెడ్డి స్వగృహంలో ఉప్పలమ్మ తల్లి – ఎల్లమ్మ తల్లి కొలుపు కార్యక్రమంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలల్లో నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, ట్రైడ్ యూనియన్ మాజీ అధ్యక్షులు దేరంగుల శీను, కోయ బాబి, పెద్ది కోటేశ్వరరావు, రాష్ట్ర ఎస్ సి విభాగం కార్యదర్శి కన్నమాల శామ్యూల్, దారెలా ప్రసన్న కూమార్, నల్లబోతుల వెంకటేష్, బండి రాజు , తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ జూపార్క్‌లో పెరగనున్న ధరలు

ఏప్రిల్ 1వ తేదీ నుండి అమల్లోకి కొత్త ధరలు

జూపార్కు ప్రవేశ రుసుము పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.40గా నిర్ణయం

కమర్షియల్ మూవీ చిత్రీకరణకు రూ.10 వేలు వసూలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** హైదరాబాద్‌లోని నెహ్రూ జంతు ప్రదర్శనశాలలో టిక్కెట్ ధరలు పెరగనున్నాయి. ఈ మేరకు పార్కులో జరిగిన జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ 13వ గవర్నరింగ్ బాడీలో కీలక నిర్ణయం తీసుకున్నారు. పెరిగిన ధరలు ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వస్తాయని నెహ్రూ జూపార్క్ క్యురేటర్ జె.వసంత ఈరోజు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇకపై జూపార్కు సందర్శనకు ప్రవేశ రుసుము పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.40 చొప్పున వసూలు చేయనున్నారు. ఫొటో కెమెరాకు అనుమతి ఇస్తే రూ.150, వీడియో కెమెరా రూ.2,500, సినిమా చిత్రీకరణ కోసం రూ.10 వేలు ఛార్జీని వసూలు చేయనున్నారు. జూపార్కులో రైలు ప్రయాణానికి పెద్దలకైతే రూ.80, పిల్లలకైతే రూ.40గా నిర్ణయించారు. బ్యాటరీ ఆపరేటెడ్ వాహనం ఎక్కితే పెద్దలకు రూ.120, పిల్లలకు రూ.70 చొప్పున నిర్ణయించారు. సఫారీ పార్కు డ్రైవ్ సీఎన్జీ బస్సు 20 నిమిషాలకు ఏసీ అయితే రూ.150, నాన్-ఏసీ అయితే రూ.100 చొప్పున వసూలు చేయనున్నారు. 11 సీట్లు కలిగిన కొత్త బ్యాటరీ ఆపరేటెడ్ వాహనం 60 నిమిషాలకు రూ.3,300, 14 సీట్ల బీవోవీ ఎక్స్‌క్లూజివ్ వాహనం అయితే రూ.4,000 వసూలు చేయనున్నారు. వాహనాల పార్కింగ్ విషయానికి వస్తే సైకిల్‌కు రూ.10, ద్విచక్ర వాహనం రూ.30, ఆటో రూ.80, కారు లేదా జీపు అయితే రూ.100, టెంపో లేదా తూఫాన్ అయితే రూ.150, 21 సీట్లు కలిగిన మినీ బస్సు రూ.200, 21 సీట్లు కలిగిన బస్సుకు రూ.300 చొప్పున ధరను నిర్ణయించారు.

## మీ ఓటు - మీ భవిష్యత్తు...! అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ఓటేయండి...!

మీ ఓటే మీ ఆయుధం!

కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించండి -నులుకుర్తి వెంకటేశ్వరరావు



**కాకినాడ రూరల్ ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కాకినాడ రూరల్ మండలంలోని సర్పవరం, గైగులపాడు, రమణయ్యపేట ప్రాంతా ల్లో మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించబడింది.ఈ ప్రచార కార్యక్రమాన్ని మాజీ జెడ్పిటిసి,టిడిపి ఎన్నికల సమన్వయకర్త నులుకుర్తి వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు మన హక్కు మాత్రమే కాదు, భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఓటరు కృషి చేయాలని ఆయన కోరారు.కూటమి ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని, ముఖ్యంగా విద్య, ఆరోగ్యం,ఉపాధి అవకాశాలు, గ్రామీణాభివృద్ధి వంటి కీలక రంగాల్లో మరింత పురోగతి సాధించేందుకు ప్రజల మద్దతు అత్యవసరమని తెలిపారు. ఈనెల 27వ తేదీన (గురువారం) ఉదయం 8:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో, కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకి మీ విలువైన ఓటును వేసి అఖండ విజయాన్ని సాధించేలా చేయాలని నులుకుర్తి వెంకటేశ్వరరావు ప్రజలను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో బోళ్ల కృష్ణమోహన్,మాసిమేని గంగయ్య,మాసిమేని శ్రీరాములు,పాలిక నాగరాజు,పాలిక శ్రీను, పంపన మహేష్,గీసాల వెంకటేశ్వరరావు, పూసల ఏసు, కాదా ప్రసాదరావు,దమ్ము నూకరాజు,మద్దూరి పవన్ కుమార్,జనసేన పార్టీ వీర మహిళలు అనుసూరి కుమారి,లక్ష్మి దేవి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ఎలక్ట్రిక్ లోకో షెడ్ లో పి ఎస్ ఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్








**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జున రావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (అటానమస్)కళాశాలలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలోలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినివిద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ శరవణ కుమార్ , ఈ. ఈ. ఈ విభాగాధిపతి డాక్టర్ కె. సురేష్ బాబు అనుమతితోఇండస్ట్రియల్ విజిట్లో భాగంగా ఇండస్ట్రియల్ విజిట్ ఇంచార్జ్ డి.డి.వి.ప్రసాద్ మరియు డిపార్ట్మెంట్ కో-ఆర్డినేటర్స్ఎన్.రాజేష్, ఎస్కే. షమీర్ మరియు పి. జె.కె. గౌరీ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలోని రైల్వే ఎలక్ట్రిక్లోకో షెడ్ ని సందర్శించారు.ఎలక్ట్రిక్ లోకో షెడ్ అనేది భారతీయ రైల్వేల కోసం ఎలక్ట్రిక్ లోకోమోటివ్లను నిర్వహించే మరియు మరమ్మతుచేసే డిపో ఇది ఆంధ్రప్రదేశ్లోని దక్షిణ మధ్య రైల్వే జోన్లో ఉంది. ఈ ఎలక్ట్రిక్ లోకో షెడ్ ఏప్రిల్ 1981లో స్థాపించబడింది. ఇదిమొదట విద్యుత్ లోకోమోటివ్లను నిర్వహించడానికి నియమించబడింది, తరువాత ఏప్రిల్ 2021లో, 3-ఫేజ్ ఎలక్ట్రిక్లోకోమోటివ్లను నిర్వహించడం ప్రారంభించింది. ఏప్రిల్ 2023 నాటికి, 264 లోకోమోటివ్లను కలిగి ఉంది, వాటిలో100 3-ఫేజ్ ఎలక్ట్రిక్ లోకోమోటివ్లు మరియు 164 ఎలక్ట్రిక్ లోకోమోటివ్లు ఉన్నాయని విద్యార్థులకు వివరించారు. అంతేకాకుండా ఇక్కడ ఎలక్ట్రిక్లోకోమోటివ్లకు ప్రధాన మరియు చిన్న నిర్వహణ మరియు మరమ్మత్తు సేవలను కూడా నిర్వహిస్తుంది. ఈ లోకో షెడ్భారతీయ రైల్వేలలోని పురాతన ఎలక్ట్రిక్ లోకో షెడ్లలో ఇది ఒకటని తెలిపారు. అత్యుత్తమ పనితీరు కనబరిచే లోకో షెడ్లలో ఒకటిగాపరిగణించబడుతుంది. దీనికి అంకితభావం మరియు నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి ఉంది.విద్యార్థిని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా వివిధ అంశాల్లో వారి యొక్క సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలి

● అధికారులకు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాలు

● పవిత్ర సంగమం వద్ద శివరాత్రి ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే



**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 25(వార్తా ప్రభ ప్రతినిధి)**మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నంలోని కృష్ణా, గోదావరి నదుల కలయిక పవిత్ర సంగమం వద్ద ఏర్పాట్లను మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఘాట్ల వద్ద మెట్లపై కాళ్ళు జారకుండా మెట్లను శుభ్రపర్చుతున్న పనులను, జల్లు స్నానాల కోసం జరిగిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడకు సుమారు 50 వేలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా తగు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలని ఘాట్లలో చెత్తబుట్టలను ఏర్పాటు చేయాలని, ఘాట్ల పారిశుధ్యం కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించనట్లు పేర్కొన్నారు.నిత్యం పారిశుధ్య నిర్వహణ జరుగుతూ ఉండాలని, ఘాట్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేటట్టు చర్యలు తీసుకుంటారని అన్నారు. అత్యవసర సేవలు అందించడానికి బోట్లు, రాత్రి సమయంలో వెలుగులు నింపేందుకు లైటింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. మరుగుదొడ్ల సౌకర్యం కల్పించామన్నారు. ముఖ్యంగా భక్తులు ఘాట్లలో నిర్దేశించిన ప్రాంతాల్లో బారికేడ్లు లోపలే పవిత్ర స్నానాలు ఆచరించే విధంగా చూడాలన్నారు. ఎటువంటి ప్రమాదాలకు తావు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), జంపాల సీతారామయ్య, చిట్టిబాబు,కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి అంటే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికలో గెలిపించండి

**ఆదిలాబాద్ ఫిబ్రవరి 25(వార్తా ప్రభ ప్రతినిధి).** అభివృద్ధి అంటేనే కాంగ్రెస్ పార్టీ అని ఎమ్మెల్సీ ఎన్నికలో పార్టీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డికే మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని పట్ట భద్రులకు మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి,అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి విజ్ఞప్తి చేసారు. మంగళ వారం పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.

## ప్రయాగ్ రాజ్ లో రెండో రోజు మంత్రి నారాయణ బృందం పర్యటన



**అమరావతి... ఫిబ్రవరి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రయాగ్ రాజ్ మహాకుంభమేళా లో రెండో రోజు మంత్రి నారాయణ బృందం పర్యటన కొనసాగింది...2027 జులై లో ఏపీలో జరిగే గోదావరి పుష్కరాల ఏర్పాట్ల కోసం మహా కుంభమేళా ఏర్పాట్లను అధ్యయనం చేసేందుకు మంత్రి నారాయణ,మున్సిపల్ శాఖ అధికారులు ప్రయాగ్ రాజ్ లో పర్యటించారు..మొదటి రోజు కుంభమేళా ఆఫీసర్ విజయ్ కిరణ్ ఆనంద్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఏర్పాట్లను మంత్రి బృందానికి వివరించారు...రెండో రోజు మంగళవారం ఉదయం కుంభమేళా జరుగుతున్న ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు...కుంభమేళా సెక్టార్ 2 నుంచి బోట్లలో త్రివేణీ సంగమం వరకూ ప్రయాణించి భక్తులకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు...స్నాన ఘాట్ల వద్ద ఏర్పాట్లు,తాగునీటి సరఫరా,మరుగుదొడ్లు,పారిశుధ్యం సమస్య లేకుండా తీసుకుంటున్న చర్యలను అక్కడి అధికారులు మంత్రి బృందానికి వివరించారు...కోట్లాది మంది భక్తులు నదిలో వేస్తున్న పూజా సామాగ్రి,ఇతర చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ నీరు కలుషితం కాకుండా తీసుకుంటున్న జాగ్రత్తలను కూడా వివరించారు...కోట్లాది మంది భక్తులు మహా కుంభమేళాకు తరలి వస్తున్నప్పటికీ ఎక్కడా పారిశుధ్య సమస్యలు తలెత్తడం లేదని తెలిపారు..కమాండ్ కంట్రోల్ రూం నుంచి ఎప్పటికప్పుడు కింది స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.రెండు రోజుల పర్యటన ముగించుకుని మంత్రి,అధికారులు బయలుదేరి రాత్రికి విజయవాడ చేరుకున్నారు.

# సార్వత్రిక ఎన్నికల ప్రభంజనాన్ని పునరావృత్తం చేద్దాం : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

● ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో.. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు మరియు కూటమి శ్రేణులతో సమావేశాలు..






**గుడివాడ,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో గుడివాడలో ఏ విధంగా అయితే మెజార్టీ సాధించామో.. నాటి ప్రభంజనాన్ని మరోసారి పునరావృత్తం చేసేలా కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో.. గుడివాడ పట్టణం ఏలూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయం (ప్రజా వేదిక)లో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు మరియు కూటమి శ్రేణులతో ఎమ్మెల్యే రాము మరియు కూటమి నాయకులు సోమవారం సాయంత్రం వేరువేరుగా సమావేశాలు నిర్వహించారు. సమావేశంలో భాగంగా పలు అంశాలపై పార్టీ శ్రేణులకు, ఎమ్మెల్యే రాము కూటమి నేతలు దిశా నిర్దేశం చేశారు. గుడివాడ నియోజకవర్గం నుండి అత్యధిక పోలింగ్ శాతం జరిగేలా ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తామని విశ్రాంత ఉద్యోగులు కూటమి నాయకులతో అన్నారు. ఈ సందర్భంగా ఇరు సమావేశాల్లో ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీని అందించి, గుడివాడ ప్రత్యేకతను ప్రభుత్వం వద్ద చాటిచెప్పి మరిన్ని నిధులు సాధించుకు వస్తానన్నారు. సాధారణ ఎన్నికల కంటే ఎమ్మెల్సీ ఎన్నికలు కొంచెం ప్రత్యేకమైనవనీ ఆ దిశగానే పోలింగ్ శాతాన్ని పెంచేలా.. పట్టభద్రులను చైతన్యపరిచేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. గుడివాడలో ఎన్నికల ప్రక్రియ ఎంతో సాఫీగా సాగిందని.. మంచి విజన్ ఉన్న ఎమ్మెల్యే రాము లాంటి వ్యక్తితో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందని ఏపీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల మంచి కోసం పట్టభద్రులందరూ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాకు మద్దతు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. ఎన్నికల పరిశీలకురాలిగా గుడివాడలో పర్యటిస్తున్న తనకు కూటమి శ్రేణుల ఉత్సాహం చూస్తుంటే ఆనందంగా ఉందని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకురాలు నుకాలమ్మ అన్నారు. కూటమి పార్టీల శ్రేణులు అందరూ పోలింగ్ అయ్యేవరకు ఇదే ఉత్సాహాన్ని కొనసాగించి.. ప్రజా నాయకుడు ఎమ్మెల్యే రాము నాయకత్వంలో ఎమ్మెల్సీగా ఆలపాటి రాజాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నూకాలమ్మ పేర్కొన్నారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ డైరెక్టరు మజ్జాడ నాగరాజు, గోకవరపు సునీల్ లు మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు భవిరి శంకర్నాథ్, గుడివాడ జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, దింట్యాల రాంబాబు, వాసే మురళీ, దానేటి సన్యాసిరావు, కే. బాపయ్య చౌదరి, ఎమ్మెల్సీ బూత్ ఇంచార్జులు, పోలింగ్ ఏజెంట్లు, నియోజకవర్గ పరిధిలోని టిడిపి, జనసేన, బిజెపి పార్టీల నాయకులు ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, పలువురు విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి..




**గుడివాడ,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** ప్రతి రైతు విధిగా తమ వివరాలను రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలనీ డిటిసి కె. జ్యోతిరమణి, ఎడిఏ కె. శ్రీనివాస్, వ్యవసాయ అధికారిణి రమాదేవి లు తెలిపారు. ఈ రోజు 25వ తేదిన గుడివాడ రూరల్ మం॥ లోని బిల్లపాడు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో .... రైతులు ఉంటే ఇప్పటి వరకు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమంలో 4500 వేల మంది నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. మినుము పంటలో ప్రతి రైతు సస్యరక్షణ చర్యలు తీసుకుని మంచి దిగుబడి వచ్చేల చర్యలు గైకొనాలన్నారు. ఈ నెల అఖరిలోపు మిగిలిన రైతులు నమోదు చేసుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి. అనంతలక్ష్మి, ఎఇఓ అనూష, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు పూర్తి : ఆర్డీవో బాలసుబ్రమణ్యం




**గుడివాడ,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు గుడివాడ డివిజన్ లో పూర్తయినట్లు ఆర్డిఓ జి. బాలసుబ్రమణ్యం తెలిపారు. ఈ రోజు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 27వ తేదీ (గురువారం) ఉదయం 8 గ॥ల నుండి సాయంత్రం 4 గ॥ల వరకు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. గుడివాడ డివిజన్ పరిధిలో ఏడు మండలాల్లో 18 వేల 440 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు ఆర్డిఓ తెలిపారు. మండల కేంద్రాల్లోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డిఓ బాలసుబ్రమణ్యం కోరారు. పట్టభద్రులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటుగా ప్రతి కేంద్రంలో మెడికల్ క్యాంపు, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని ఆర్డిఓ తెలియజేశారు.

## పార్టీలకు అతీతంగా మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నాం

● ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నాం ● వెల్వడం తిరునాళ్ల కు వచ్చే భక్తులకు ఈ సారి ఎంటర్టైన్మెంట్ ఉండబోతోంది ● గ్రామస్తుల సహకారంతో జరిగే తిరునాళ్లు విజయవంతం కావాలని ఆశిస్తున్నాం ● పోలీసులు, మీడియా సహకారం అవసరం ● విలేకరుల సమావేశంలో శివరాత్రి ఉత్సవాల నిర్వాహకులు శీలం రవీంద్ర రెడ్డి



**మైలవరం (వెల్వడం),ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** పార్టీలకతీతంగా వెల్వడం గ్రామంలో బాల కోటేశ్వర స్వామి దేవాలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఉత్సవాల నిర్వాహకులు ప్రవాసాంధ్రులు(ఎన్ ఆర్ ఐ)శీలం రవీంద్ర రెడ్డి అన్నారు. మండలంలోని వెల్వడం గ్రామంలో తమ స్వగృహంలో మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ గతంలో గ్రామస్తులు యూనిటీగా ఉండేవారని ప్రస్తుతం ఆ యూనిటీ తగ్గిందన్నారు. ఈ సారి గ్రామస్తులందరు సహకారంతో మూడురోజులు జరిగే ఉత్సవాలను విజయవంతం కావాలని ఆశిస్తున్నామని తెలిపారు. ఉత్సవాలుకు అయ్యే ఖర్చు పెరిగిందని ఆదాయం మాత్రం తగ్గిందన్నారు. అయినప్పటికీ వెల్వడం తిరునాళ్ల కు వచ్చే భక్తులకు ఈ సారి ఎంటర్టైన్మెంట్ ఉండబోతుందని వెల్లడించారు. ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని, పోలీసులు మీడియా సహకారం కూడా అవసరం అన్నారు. తిరునాళ్లలో అనుకొని సంఘటనలు ఎదురైతే దేవుని కార్యంగా భావించాలని కోరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రోడ్లు, విద్యుత్, తాగు నీటి సౌకర్యం కల్పించామన్నారు. కోనేటి వద్ద మహిళలు స్నానాలు ఆచరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, మొదటి రోజు ఉత్సవ విగ్రహాలను గ్రామం నుంచి ఊరేగింపుగా బాలకోటేశ్వర స్వామి గుడికి చేర్చడంతో ప్రారంభమవుతాయన్నారు. 26వ తేదీ రాత్రి ఎడ్లబండితో ప్రబల ఊరేగింపు,ప్రభ ఊరేగింపులో డప్పులు, కనక తప్పెటలు, సన్నాయి బ్యాండ్ మేళం, కోలాటం, ఇంకా అనేక రకాల కార్యక్రమాలతో ప్రభోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. 27 వ తేదీన స్వామి వారి కళ్యాణం మరియు రథం ఊరేగింపు, అఖండ హారతి, కూచిపూడి, భరతనాట్యం, పూల రంగడు నాటకం,అలాగే 28 వ తేదీన మెగా మ్యూజికల్ గ్రాండ్ ఈవెంట్ మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని రవీంద్ర రెడ్డి తెలియజేశారు. ఈ సమావేశంలో యరమల రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

**పిఠాపురం,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** ఈనెల 28వ తేదీన శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు కౌన్సిల్ సాధారణ సమావేశం, మున్సిపల్ చైర్ పర్సన్ గండేపల్లి సూర్యవతి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కనకారావు ప్రకటనలో తెలిపారు.

## ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



**కంకిపాడు,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** ఉమ్మడి కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఎలక్షన్ కోడ్ అమలులో ఉండటం వలన మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు అప్పు చేశారు. కంకిపాడు గ్రామ యూనిట్ ఇంచార్జ్ కాకుమాను రమేష్ పర్యవేక్షణలో కూటమి ప్రతినిధులు మరియు బూత్ ఏజెంట్ గత 20 రోజులుగా గ్రామంలో ఉన్న సుమారు 590 మంది పట్టభద్రులను కలిసి కూటమి అభ్యర్థి అలపాటి రాజేంద్రప్రసాద్ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రతినిధులు ప్రతి ఒక్కరు వారి కేటాయించిన 30 మంది పట్టభద్రులను కలిసి ఓటును అభ్యర్థించారన్నారు. ఏ ఒక్కరిని మిస్ అవ్వకుండా 100% పట్టభద్రులందరిని కలిసినట్లు పేర్కొన్నారు. ప్రచారానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## పూర్వ ప్రాథమిక విద్యలో మొదటి గురువు అంగన్వాడీ టీచర్లే

● అంగన్వాడి వర్కర్ల శిక్షణ ముగింపు లో ఏ ఎమ్ వో శ్యాంసుందర్.



**పెడన,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** తల్లి దండ్రుల తర్వాత శిశువుకు పూర్వ ప్రాథమిక విద్యలో మొదటి గురువు అంగన్వాడీ టీచర్లే నని సమగ్ర శిక్ష కృష్ణ జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఆర్ శ్యామ్ సుందర్ అన్నారు. గత 6 రోజులుగా పెడన లోని స్థానిక బంగ్లా స్కూల్లో అంగన్వాడి వర్కర్లకు జ్ఞాన జ్యోతి శిక్షణా ముగింపు కార్యక్రమంలో గురువారం ఏ ఎమ్ వో శ్యామ్ సుందర్ పాల్గొని మాట్లాడుతూ శిశువుకు కుటుంబం తర్వాత ఆలనా పాలనా చూసుకునేది అంగన్వాడి టీచర్లు వారి సమగ్ర అభివృద్ధి కి కృషి చేయాలని ముఖ్యంగా అభ్యసన సామాగ్రిని ఉపయోగించి కృత్యాధార బోధన జరపాలని అన్నారు. ఎమ్ ఇ వో హరనాథ్ మాట్లాడుతూ శిక్షణ లో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో అమలు చేయాలన్నారు. సీడీపీఓ ఎమ్ సముద్ర వేణి మాట్లాడుతూ బోధన లో మెళకువలను నేర్పడానికి అంగన్వాడీ వర్కర్లకు ఇచ్చిన ఈ శిక్షణా ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. శిక్షణ పొందిన అంగన్వాడీ వర్కర్లకు సర్టిఫికెట్ లు అందించారు. రిసోర్స్ పర్సన్లుగా సుపర్వైజర్లు పి.కల్పవల్లి కె.శ్రవణ కుమారి కె.శ్రీమన్నారాయణ కె.హనుమంత రావు లు వ్యవహరించారు. రెండు విడతలుగా జరిగిన ఈ శిక్షణలో మొత్తం 90 మంది అంగన్వాడీ వర్కర్లు శిక్షణ పొందారు.

## లకిరెడ్డి పాపులమ్మ హై స్కూల్ 39వ వార్షికోత్సవం





**మైలవరం (వెల్వడం),ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** మండలంలోని వెల్వడం గ్రామ శివారు లకిరెడ్డి పాపులమ్మ వె-ుమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 39వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కరోనా మరియు ఇతర కారణాలతో గత 4 సంవత్సరాలుగా జరగని వార్షికోత్సవ వేడుకలు ఈ సంవత్సరం నూతన భవనంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన్నట్లు ప్రధానోపాధ్యురాలు పి. సాయికుమారి తెలియజేశారు. ఈ వార్షికోత్సవ వేడుకలలో డాక్టర్ లకిరెడ్డి హనిమి రెడ్డి, లకి రెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ కో ఫౌండర్ అండ్ హానరరీ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాష్ రెడ్డి, లకిరెడ్డి సిద్ధార్థ రెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. గత సంవత్సరం పదవతరగతి లో అత్యధిక మార్కులు సాధించి ఏ పి ఆర్ జె సి నందు సీట్ సాధించిన ఎమ్. యవరాజ్ ను, 2023 సంవత్సరం పదవతరగతి లో ప్రతిభ కనబరిచి ఐ ఐ ఐ టి లో సీట్ సాధించిన పి.కీర్తన కు నగదు బహుమతులను అందించారు .ఆటల పోటీల్లో గెలిచిన విద్యార్థిని విద్యార్థు లకు హనిమిరెడ్డి మెడల్స్ బహుకరించారు. మండల విద్యాశాఖాధికారి 2 ఎల్.బాలు మాట్లాడుతూ ఇంత మంచి వసతులు కలిగిన స్కూల్ ఈ చుట్టుప్రక్కల లేదని, దాతలు అందించిన సౌకర్యాలు వినియోగించుకొని విద్యార్థులు బాగా చదువుకొని మంచి విద్యాసంస్థలలో ప్రవేశాలు పొంది వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. జి.నాగిరెడ్డి మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. లకిరెడ్డి హనిమిరెడ్డి గారిచే మళ్ళీ నూతనంగా నిర్మించిన ఈ స్కూల్ బిల్డింగ్, వసతులు అన్ని చాలా బాగున్నాయని అందరు మంచిగా చదువుకొని పెద్దలు చూపిన బాటలో నడిచి భావిభారత పౌరులుగా ఎదగాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. అనంతరం హనిమి రెడ్డి ని, సిద్ధార్థ రెడ్డి ని శాలువా, పుష్పగుచ్ఛముతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెల్వడం ప్రవాసభారతీయులు లకిరెడ్డి పుల్లా రెడ్డి, యరమల సత్య నారాయణ రెడ్డి, లకిరెడ్డి సత్యం రెడ్డి, స్కూల్ ఓల్డ్ స్టూడెంట్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జి.నాగరాజు, ఉపాధ్యాయులు జడ్.నరసింహా రెడ్డి, పి.గోపాల్, పి డి లు బి. నాగమణి ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా త్రివిధ పాఠశాల 15వ వార్షికోత్సవ వేడుకలు







**నూజివీడు,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** నూజివీడు పట్టణంలోని త్రివిధ పాఠశాలలో 15వ వార్షకోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విజయవాడలోని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ భవాని ప్రకాష్, గౌరవ అతిథిగా నూజివీడు మండల విద్యాశాఖాధికారి ఎస్ జమలయ్య, ప్రత్యేక అతిథిగా స్టేట్ బ్యాంక్ పూర్వ ఏ జి ఎం ఏబీఎస్ ప్రకాశరావు విచ్చేసారు. ఈ సందర్భంగా డాక్టర్ భవాని ప్రకాష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం చాలా అవసరమన్నారు. విద్యార్థులకు ఒత్తిడిని దూరం చేసే పలు చిట్కాలు తెలిపారు. అదేవిధంగా మంచి ఆహారం తీసుకోవడంతోపాటుఆటలు, మంచి నిద్ర, తగినంత నీరు తీసుకోవాలన్నారు. నూజివీడు ఎంఈఓ ఎస్ జమలయ్య మాట్లాడుతూ నూజివీడు పరిసర ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి త్రివిధ పాఠశాల కృషిని కొనియాడారు. మరో అతిధి ప్రకాశరావు మాట్లాడుతూ యాజమాన్యం, ఉపాధ్యాయుల సమిష్టి కృషి విద్యార్థుల విద్యాభివృద్ధికి చాలా అవసరమన్నారు. సమిష్టి కృషితో విద్యార్థుల అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి త్రివిధ పాఠశాల యాజమాన్యం చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ సందర్భగా విద్యార్థులు సాంస్కృతిక, సందేశాత్మక కార్యక్రమాలతో ఆహుతులను అలరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో 26వ తేదీ నుండి ఉత్సవాలు



**ఏలూరు జిల్లా, నూజివీడు,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** నూజివీడు నియోజకవర్గంలోని ముసునూరు మండలం బలివే గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో 26వ తేదీ నుండి ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో స్వామివారి దర్శనానికి, పిండ ప్రధానాలు, జల్లు స్నానాలకు సంబంధించి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. భారతదేశంలో దక్షణ కాశీగా పేరుపొందిన శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి ప్రతి ఏటా సుమారు రెండు లక్షల మందికి పైగా భక్తులు ఇక్కడ జరిగే ఉత్సవాలకు తరలి వస్తారు. శ్రీరాముల వారు లంకలో రావణాసురుడిని వధించిన అనంతరం తిరుగు ప్రయాణంలో బ్రహ్మ హత్య పాతకం తనకు అంటకూడదనే ఉద్దేశంతో 108 శివలింగాలను ప్రతిష్టించుకుంటూ వస్తున్న క్రమంలో బలివే గ్రామంలో అత్యంత మహిమ కలిగిన బ్రహ్మ సూక్త శివలింగాన్ని ప్రతిష్టించినట్లు ఇక్కడ ప్రచారంలో ఉంది. ఈ బ్రహ్మ సూక్త లింగాన్ని దర్శించుకున్న వారికి, అభిషేకాలు చేసిన వారికి సకల పాపాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. ఆలయాన్ని సందర్శించుకునే సమయంలో భక్తులకు దాహార్తిని తీర్చేందుకు, స్వామివారికి అభిషేకాలు చేసేందుకు నీరు అవసరమై ఉన్నందున లక్ష్మణుడు ఆలయం వద్ద బాణాన్ని సంధించి తమ్మిలేరును సృష్టించినట్లు పురాణాల్లో సైతం ప్రస్తావించినట్లు ఆలయ ఈవో సీతారామయ్య తెలిపారు. కాశీకి వెళ్లి పిండ ప్రధానం చేసుకోలేని వారు సాక్షాత్తు మహావిష్ణువు స్వరూపుడైన శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన ఆలయం ఇది. ఇక్కడ పిండ ప్రధానం చేస్తే రెట్టింపు ఫలితం వస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ ఏడాది విజయరాయి నుండి బలివేకు ప్రధాన మార్గంగా ఉన్న రహదారిపై తమ్మిలేరు వద్ద బ్రిడ్జిని నిర్మించడంతో భక్తుల తాకిడి పెరిగే అవకాశం ఉందని ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 500 మంది పోలీసులు, వాలంటీర్లు, ఎన్ సి సి వారిని బందోబస్తుకు ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారన్నారు. ఆలయ ప్రాంగణంలో చంటి పిల్లలకు పాలు ఇచ్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు జల్లు స్నానాలు ఆచరించిన అనంతరం దుస్తులు మార్చుకునేందుకు మహిళలకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో సీతారామయ్య తెలిపారు. బలివే ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ప్రత్యేక రవాణా సౌకర్యాలు ఏర్పాట్లు చేశామన్నారు. 26వ తేదీన ఉదయం 10 గంటలకు స్వామివారి కళ్యాణం జరుగుతుందని, అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో స్వామివారి లడ్డు ప్రసాదాన్ని అందించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతంలో ఉత్సవాలకు తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఎగ్జిబిషన్, షాపులను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఎన్నడు లేనివిధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని, పిండ ప్రధానం చేసేందుకు, జల్లు స్నానాలు చేసేందుకు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం బాగుందని పలువురు భక్తులు తెలిపారు.

## మద్దూరు లో మహాశివరాత్రి స్నానాలకు సర్వం సిద్ధం





**కంకిపాడు,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** మండలంలోని మద్దూరు ఎన్టీఆర్ పుష్కర్ ఘాట్ లో మహాశివరాత్రి పర్వదినాన పురస్కరించుకొని స్నానాలకు, పిండ ప్రదానాలు చెయ్యటానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సర్పంచ్ రామదాసు, పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం మద్దూరు కృష్ణా నది పరివాహక ప్రాంతం పుష్కర ఘాట్ లో పనులను పరిశీలించారు ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శానిటేషన్, త్రాగునీటి సరఫరా, లైటింగ్, షామ్యానాలు, గజతగాళ్లు, నావలు, ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా నది స్నానం చేయువారు నదిలో లోతైన గుంతలు ఉండటం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందువలన ఎవరూ కూడా బారీ గేడు దాటి రాకూడదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళలు వస్త్రాలు మార్చుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. సుమారు స్నానాలుకి 40 నుంచి 50 వేలు దాకా వస్తారని అంచనా వేశారు. రెవెన్యూ మరియు పోలీస్ శాఖ సిబ్బంది పర్యవేక్షిస్తారు అన్నారు. మాజీ జడ్పిటిసి సభ్యులు గొంది శివరామకృష్ణ ఆధ్వర్యంలో సుమారు 15 లక్షల తో నిర్మించిన శివాలయని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వచ్చే భక్తులు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

## ఎమ్మెల్సీ పోలింగ్ రోజున స్పెషల్ క్యాజువల్ లీవ్-ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,ఫిబ్రవరి 25 (వార్తాప్రభ) :** ఈ నెల 27న కృష్ణా-గుంటూరు జిల్లాల శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఆ రోజు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఓటు హక్కు ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రకటించినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్న దృష్ట్యా ప్రైవేటు, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, ఇతర సంస్థలు కూడా ఓటరుగా నమోదు చేసుకున్న తమ ఉద్యోగులు, కార్మికులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు విధుల సమయాన్ని తగ్గించడం లేదా షిఫ్ట్‌లను సర్దుబాటు చేయడం వంటి వెసులుబాట్లు కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

